Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 08.06.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 01 పేజీలు : 12, వెల : ₹ 5


# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com


## లక్షణమైన అక్షరానికి... ముప్పైయేడేళ్ళు

సరిగ్గా ముప్ఫైయేడేళ్ళు. 2018 జూన్ 5వ తేదీన 38వ యేట అడుగుపెట్టింది మా(మీ) లాయర్. 1981 జూన్ 5న నెల్లూరు నగరం నడిబొడ్డులోని ఓ చారిత్రాత్మక సంస్థని, సంస్థ ఆస్తులను కాపాడడానికి ఉద్యమస్ఫూర్తితో ప్రారంభమై, ఆనాటి నుండి ఈనాటి వరకూ అదే స్ఫూర్తితో, చైతన్యదీప్తితో ప్రగతిపథం వైపు దూసుకుపోతున్న మా(మీ) లాయర్‌కి ఇప్పుడు 37 సంవత్సరాలు నిండాయి.

లక్షణమైన అక్షరంతో విలక్షణమైన వార్తావిశేషాలతో సులక్షణమైన కథనాలతో ప్రజల హక్కుల సంరక్షణ కోసం నిరంతరం ప్రాకులాడుతూ వారంవారం పోరాడుతూ తనదైన శైలితో ముందుకు సాగుతోంది మా(మీ) లాయర్.

ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎలాంటి ఆటంకాలు ఏర్పడినా నిరంతరం అక్షర సమరమే ధ్యేయంగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా వారం వారం పాఠకుల ముంగిళ్ళలో వాలుతోంది మా(మీ) లాయర్.

మారుతున్న కాలంతో పోటీ పడుతూ నాణ్యతలో రాజీపడకుండా, తనను తాను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకుంటూ అందంగా, ఆకర్షణీయంగా ముస్తాబై పాఠకుల ప్రశంసలు అందుకుంటూ ప్రకటనకర్తల ఆదరణ పొందుతూ చందాదారుల అభిమానాన్ని చూరగొంటూ భవిష్యత్ వైపు అడుగులు వేస్తోంది మా(మీ) లాయర్.

లాయర్ వేసే ప్రతి అడుగు వెనుక వున్నది లాయర్ ఆత్మీయులే. నీకు మేమున్నాం అంటూ ముందుకు నడిపించింది, నడిపిస్తోంది, నడిపించబోతోంది లాయర్ అభిమానులే. తమ కుటుంబంలో భాగంగా లాయర్‌ను గుండెకు హత్తుకుని తమ ఇంటి పత్రికగా తమ కంటిపాపగా లాయర్‌ను చేరదీస్తున్నది చేరువ చేసుకున్నదీ లాయర్ ఆత్మబంధువులే!

మాట తప్పకుండా మడమ తిప్పకుండా కోటి ఆశలతో ముక్కోటి ఆకాంక్షలతో శతకోటి ఆశయాలతో ముందుకు సాగుతున్న మా(మీ) లాయర్‌కు అండ దండ మీరే! మీ ఆలోచనలకు ధీటుగా... మనస్సాక్షికి అక్షరసాక్ష్యంగా... మీ ఆకాంక్షలకు ప్రతిరూపంగా... మీకిచ్చిన మాటే బాసగా... మీరందిస్తున్న భరోసాయే శ్వాసగా ప్రపంచ వ్యాప్తంగా వున్న నెల్లూరీయుల సేవలో పునరంకితమౌతున్నామని ప్రమాణం చేస్తూ... ఆదరించి అభిమానిస్తున్న ప్రతిఒక్కరికీ వినయపూర్వక ప్రణామాలు అర్పిస్తూ...

తుంగా శివప్రభాత్‌రెడ్డి

సం/-

# పంచతంత్రం



- ఉపఎన్నికల యుద్ధానికి వైసిపి సిద్ధం
- రాజీనామాలతో చిత్తశుద్ధి చాటుకున్న ఎంపీలు
- కేంద్రం చేతిలో కీలక నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రగతికి ఆశాదీపం ప్రత్యేకహోదా. ఆంధ్రా నిరుద్యోగులకు ఉపాధిమార్గం ప్రత్యేకహోదా. విభజన తర్వాత ఎటువంటి ఆధారం లేని రాష్ట్రానికి అదే సంజీవని. ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తు, భద్రత అదే!

విభజన బిల్లులో ప్రత్యేకహోదా అంశాన్ని చేర్చకుండా నాటి యూపిఏ ప్రభుత్వం ఈ రాష్ట్ర ప్రజలను వంచనకు గురిచేస్తే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి అవకాశాలు లేవని ప్రణాళికా సంఘం చెప్పిందంటూ చేతులెత్తేసింది. కేంద్రం ఇవ్వకుంటే, ఎందుకివ్వరు, ఇది మా హక్కు అంటూ కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం హోదా కంటే ప్యాకేజీయే మేలంటూ సరిపెట్టుకుంది. ఈ విధంగా పై మూడు ప్రభుత్వాలు ఆంధ్రా ప్రజానీకానికి తీరని ద్రోహం చేసాయి.

ప్రత్యేకహోదా అంటే జైలుకే అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా బెదిరింపులకు దిగినా ఈ రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టింది, నాలుగేళ్ళుగా నడిపింది, జనం గుండెలను తాకేలా చేసింది, కేంద్రాన్ని కదిలించేలా చేసింది ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డే! నాలుగేళ్ళుగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ దీని కోసం నిరంతర పోరాటం చేస్తూనేవుంది.

ప్రత్యేకహోదా కోసం దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు, బంద్‌లు... వైసిపి ఆధ్వర్యంలో జరిగాయి. హోదా ఉద్యమంలో జగన్ వేసిన మరో ముందడుగే తన పార్టీ లోక్‌సభ సభ్యుల చేత రాజీనామాలు చేయించడం. వైసిపి లోక్‌సభ సభ్యులు 5మంది గత నెలలోనే రాజీనామాలు చేసారు. లోక్‌సభ స్పీకర్

(మిగతా 11వ పేజీలో)

## బాలూ పుట్టినరోజు... పాటకు పండుగ రోజు



3లో






# కులకాష్టంలో రాష్ట్రం

- రాజకీయాలను గబ్బు పట్టిస్తున్నారు

స్వర్గీయ టంగుటూరు ప్రకాశం పంతులు నుండి వై.యస్.రాజశేఖరరెడ్డి వరకు ఎందరో నాయకులు ఈ రాష్ట్రాన్ని పాలించారు. నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నందమూరి తారకరామారావు, కె.రోశయ్య... ఎవరి హయాంలోనూ ఈ రాష్ట్రంలో కులాల సమస్య తలెత్తలేదు. కులాల మధ్య చిచ్చు రేగలేదు. అంతెందుకు 1995-2004ల మధ్య సీఎంగా వున్న చంద్రబాబు నాయుడు కాలంలోనూ రాజకీయాలలో పెద్దగా కులాలకు ప్రాధాన్యత లేదు.

(మిగతా 11వ పేజీలో)

# అంగరంగ వైభవంగా చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు


సుళ్ళు ఉత్సవం

- నయనమనోహరం.. సుళ్ళు ఉత్సవం
- కనువిందుగా అమ్మవారి తెప్పోత్సవం
- జనసంద్రంగా మారిన సూళ్ళూరుపేట


తెప్పోత్సవం

సూళ్ళూరుపేటలో కొలువైవున్న శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ళ వేడుకలకే వేడుక అన్నట్లుగా ఎంతో సంబరంగా జరిగాయి. అంగరంగవైభవంగా జరిగిన ఈ ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారిని కన్నులారా దర్శించుకుని తరించారు. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు నెరవేర్చే చల్లనితల్లిగా ప్రసిద్ధి చెందిన శ్రీ చెంగాళమ్మ అమ్మవారికి గత నెల 31 నుంచి ఈ నెల 6వ తేది వరకు ఏడురోజులపాటు ఎంతో ఆనందోత్సవాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ తిరునాళ్ళలో భాగంగా తొలిరోజు బలిహరణ, రెండవరోజు అశ్వవాహనం, మూడవ రోజున మహిషాసురమర్ధని ఉత్సవం, నాల్గవ రోజు సుళ్ళ ఉత్సవం, నందిసేవ, అయిదవ రోజు తెప్పోత్సవం, ఆరవరోజున శయనసేవ, ఏడవరోజు పుష్పపల్లకిసేవ నేత్రపర్వంగా జరిగాయి. ఈ సందర్భంగా 1 నుంచి 5వ తేది వరకు ప్రతిరోజు అమ్మవారికి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సూళ్ళూరుపేట పట్టణం, ఆలయ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. ఈ తిరునాళ్ళలో భాగంగా మూడురోజులపాటు సుళ్ళ ఉత్సవాలు మరింత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని ఎంతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డితో పాటు, ధర్మకర్తలమండలి సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆద్యంతం నయనమనోహరంగా జరిగాయి. ఉత్సవాల ఏర్పాట్లు ఘనంగా జరిగాయి.

### అట్టహాసంగా సుళ్ళు ఉత్సవాలు :

చెంగాళమ్మ అమ్మవారి తిరునాళ్ళలో భాగంగా జరిగే సుళ్ళ ఉత్సవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.


నంది వాహనంపై అమ్మవారు

పూలమాల, వడిబాల, రోలు, మేక పిల్ల, మనిషి బొమ్మలను సుడి మానుకు కట్టి మూడుసార్లు వంతున చుట్టూ ఊరేగించి పాలవెల్లికి కట్టి తిప్పారు. ఈ సందర్భంగా గంగ పెట్టెతో యాదవులు వీరతాళ్ళతో చేసిన వీరనాట్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సుళ్ళు ఉత్సవాలను తిలకించేం దుకు భక్తులు జిల్లావ్యాప్తంగానే కాక, తమిళనాడు తదితర దూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెండవరోజైన శనివారం నాడు ఎంతో పవిత్ర మైన ఈ సుడిమానుపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. ఆ తర్వాత కొద్దిసేపటికల్లా వాతావరణం బాగా మారిపోయి వాన కురవడంతో, అమ్మవారి ఉత్సవాల్లో ఇలా వర్షం కురవడం ఎంతో శుభసూచకమని భక్తులు ఆనందపరవశులయ్యారు. ఈ వేడుకల్లో ఆలయ ఛైర్మెన్, ఇ.ఓలతో పాటు మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, పాలక మండలి సభ్యులు చిలకా యుగంధర్, ఆకుతోట రమేష్, ఆలవల సూరిబాబు, పిట్ల సుహాసిని, వేనాటి గోపాల్‌రెడ్డి, పులుగు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### కనువిందుగా తెప్పోత్సవం :

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అయిదవరోజు తెప్పోత్సవం మరింత వేడుకగా జరిగింది. దాదాపు రెండు లక్షలమందికిపైగానే భక్తులు ఈ ఉత్సవానికి తరలివచ్చారు. ఎటుచూసినా భక్తజనంతో కాళంగి నదీ ప్రాంతం, అమ్మవారి ఆలయ ప్రాంతమంతా ఇసుకేస్తే రాలనంతగా జనసందోహం కనిపించింది. ఆలయం చెంతనే ఉన్న కాళంగినదిలో హంసవాహనంపై అమ్మవారి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. కాళంగి నదిలో అమ్మణ్ణి విహారం భక్తులకు కనువిందు చేసింది. అమ్మవారి నామస్మరణలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. బాణసంచా వేడుకలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. ఈ నెల 5న అమ్మవారికి శయనసేవ, గ్రామోత్సవాలతో పాటు, 6న ఎంతో కన్నులపండువగా అమ్మవారికి పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తిరుపతి ఎంపి వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వేనాటి సురేష్‌రెడ్డి, పాళెం రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, కె.సురేష్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ఉత్సవాల్లో పెద్దఎత్తున పోలీసుబందోబస్తు ఏర్పాటుచేశారు.

### అలరించిన సాంస్కృతిక సంబరాలు :

ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున సాంస్కృతిక సంబరాలు కూడా ఏర్పాటుచేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ కళాకారులు, కళాబృందాలు ఈ సంబరాల్లో పాల్గొని భక్తులను అలరించారు.ప్రముఖ సినీ నేపథ్యగాయని పి.సుశీల, కళాభినేత్రి వాణిశ్రీలు విచ్చేసి ఈ ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా, జబర్దస్త్ కమెడియన్ రాకేష్ యోధా సిస్టర్స్ హాస్యవల్లరి అందరినీ కడుపుబ్బ నవ్వించింది. రోషన్‌లాల్ బృందం పాటకచ్చేరీ, సూళ్ళూరుపేటకు చెందిన కవిత బృందం నృత్యప్రదర్శన, హైదరాబాద్‌కు చెందిన నిర్మల విశ్వేశ్వరరావు బృందం శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 5వ రోజున జబర్దస్త్ కెమెడియన్లు బబ్లు, పవన్, వినోద్, పొట్టి విజయల హాస్యవల్లరి, బోల్ బేబీ బోల్ ఫేమ్ రమేష్ ఆర్కెస్ట్రా, ఇంకా శాస్త్రీయనృత్యాలు, శ్రీ చెంగాళమ్మ నాట్యమండలివారిచే సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన.. ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో ఆనందోత్సాహాలతో భక్తిభావ సమన్వితంగా సాగాయి.

## కరిమాణిక్యస్వామి రథోత్సవం



నెల్లూరుజిల్లా నాయుడుపేట మండలం తుమ్మూరు శ్రీదేవి, భూదేవి కరిమాణిక్య స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 2న ఉదయం కరిమాణిక్య స్వామి రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. కల్యాణోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి వారు ప్రత్యేక అలంకరణలో ఆలయం ముందు భాగంలో ఉంచిన రథంపై కొలువుదీరారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేదపండి తులు ప్రత్యేకపూజల అనంతరం రథోత్సవ వేడుకలు ప్రారంభించారు. గోవిందనామ స్మరణలతో భక్తులు స్వామివారి రథాన్ని ఆలయం నుంచి తుమ్మూరు పురవీధుల మీదుగా కళ్యాణ మండపం వరకు రథం కొనసాగింది. స్వామివారికి నిత్యసేవల్లో భాగంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సహస్రనామార్చన సర్వదర్శన వేడుకలు జరిగాయి. సాయంత్రం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవ పూజలు నిర్వహించారు. అనంతరం ఏకాంత సేవ జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు రావడంతో తమ్మూరు గ్రామం భక్తులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటి డి.ఓ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కామరాజ్, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. కొందరు దాతలు, భక్తులు మజ్జిగప్యాకెట్లు పంపిణీ చేశారు.

## కోన ఇ.ఓ బదిలీ

పెంచలకోన దేవస్థానం ఇ.ఓ ఎస్.రామ్మూర్తిని నెల్లూరులోని ఆరణి కందప్ప మేస్త్రీ సత్రం ఇ.ఓగా బదిలీ చేసారు. ఈమేరకు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసారు. కొత్త ఇ.ఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

## భ్రమరాంబపై వేటు పడింది



శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఇ.ఓ భ్రమరాంబపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. విజయవాడ దేవాదాయ శాఖ కార్యాలయంలో ఆమెను రిపోర్టు చేసుకోమని ప్రభుత్వం ఆదేశించింది. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్-2గా విధులు నిర్వహిస్తున్న రామస్వామిని నియమించారు. శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ నాయకుల ఒత్తిడితోనే ఆమె బదిలీ జరిగినట్లుగా తెలుస్తోంది. దేవ స్థానంలో భ్రమరాంబ ఏకపక్ష నిర్ణయాలు, ట్రస్టుబోర్డుతో వచ్చిన విభేదాల నేపథ్యం లోనే టీడీపీ నాయకులు ఆమె బదిలీకి ప్రయత్నించారు. అలాగే ఆమెపై మరికొన్ని ఆరోపణలు కూడా వచ్చాయి.

## నేత్రపర్వంగా శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈనెల 2వ తేది ఉదయం 11 గంటలకు నిత్యకల్యాణమండపంలో స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారు, దేవేరుల ఉత్సవ విగ్రహాలను స్వర్ణాభరణాలతో, సుగంధపుష్పా లతో శోభాయమానంగా అలంకరించి వేదమంత్రాల మధ్య ఎంతో వేడుకగా కల్యాణో త్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివార్లకు సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.




## పొణకా కుటుంబానికి పరామర్శలు





గూడూరు టీడీపీ నాయకులు పొణకా శివకుమార్‌రెడ్డి సోదరుడు మేజర్ పొణకా శ్రీనివాసులురెడ్డి ఈ నెల 7వ తేదీ ఉదయం తీవ్ర అనారోగ్యంతో హఠాణ్మరణం చెందారు. ఆయన వయస్సు 60 సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ విభాగాధి పతిగా పనిచేస్తున్న ఆయన ఎన్‌సిసిలో అందించిన సేవలకుగాను మేజర్ బిరుదును ప్రభుత్వం ప్రకటించింది. దానివల్లే ఆయన మేజర్ శ్రీనివాసులురెడ్డి అయ్యారు. కాగా, గురువారం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, గూడూరు మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కోడూరు కల్పలత, కోడూరు మీరారెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్ తదితర ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి, పొణకా కుటుంబసభ్యులను పరామర్శించారు.



# బాలూ పుట్టినరోజు..పాటకు పండుగరోజు

## • అమ్మ దీవెన.. జానకమ్మ ఆశీర్వచనం
## • పులకించిన పురమందిర ప్రాంగణం

*గానగంధర్వుని పుట్టిన రోజంటే..పాటకు పండుగ రోజే. భారతీయ సినిమా గర్వించదగ్గ గాయకుడు, విశ్వవిఖ్యాత గాయకుడు, నెల్లూరు ముద్దుబిడ్డ..మన గానాలపట్టి.. శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (యస్‌పి బాలూ) జన్మదినోత్సవ వేడుకలు ఈనెల 4న నెల్లూరు పురమందిర ప్రాంగణంలోని ఆరుబయటవేదికపై అద్వితీయంగా జరిగాయి. పాటల కోయిలమ్మ జానకమ్మ ఈ వేడుకకు విచ్చేసి బాలుని ఆశీర్వదించడం, తన ఉజ్వలభవితకు తొలి ఆశీస్సులందించిన జానకమ్మకు బాలూ సాష్టాంగ ప్రణామం చేసి తన కృతజ్ఞతాపూర్వక నమస్కారాన్ని అందజేయడం, తన మాతృమూర్తి శకుంతలమ్మ నుంచి బాలూ ఆశీస్సులందుకోవడం.. వేదికంతా ఆత్మీయతలు వెల్లివిరిసినట్లయింది. ఈ సందర్భంగా పలువురు సినీప్రముఖులు విచ్చేసి బాలూతో, జానకమ్మతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం విశేషం. ఇదే సందర్భంలో జానకమ్మ జీవితచరిత్రను లఘుచిత్రంగా ప్రదర్శించడం ప్రేక్షకులందరినీ బాగా ఆకట్టుకుంది. అంతేకాక, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ, నూజివీడు ట్రిపుల్ ఐటిలో యోగా విభాగం నిర్వాహకులు సత్యశ్రీధర్ ఆధ్వర్యంలో 27 మంది విద్యార్థులచే ప్రదర్శితమైన ప్ర'యోగా'త్మక నృత్యరూపక ప్రదర్శన.. ఈ వేడుకల్లో ఒక హైలైట్‌గా ఉండి... అందరి కరతాళధ్వనులందుకుంది.*



తొలుత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వేదిక వద్దకు రాగానే ప్రేక్షకుల్లో సంతోషం వెల్లివిరిసింది. బాలూ పుట్టినరోజు వేడుకలో తామూ పాల్గొంటున్నామన్న ఆనందం అందరిలోనూ కనిపించింది. శ్రీ విజేత ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాలు ఆద్యంతం ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలూ మాట్లాడుతూ, తన పదహారేళ్ళ వయసులో 1960-63 ప్రాంతాల్లో గూడూరు కాళిదాస కళానికేతన్ వారు నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొన్నప్పుడు, ఆ పోటీకి న్యాయ నిర్ణేతగా విచ్చేసిన ప్రఖ్యాత గాయని ఎస్.జానకి తనను మంచి గాయకుడివవుతావని దీవించారని అన్నారు. మాతృసమానురాలైన ఆ చల్లనితల్లి దీవెనలే తనకు ఇంతటి ఉన్నతస్థానాన్ని తెచ్చాయని బాలూ వినమ్రంగా తెలిపారు. సినీరంగంలో జానకమ్మ పాటలు అద్వితీయమైనవని అంటూ, ఎవరూ పాడలేని ఎంతో కష్టమైన పాటలను కూడా ఆమె అలవోకగా పాడగల దమ్మున్న గాయని అని ఆయన కొనియాడారు. జానకమ్మ ఆశీస్సులు తననెంతగానో ఉన్నతస్థాయికి తీసుకువచ్చాయని, అందుకు కృతజ్ఞతగా సన్మానం చేయాలనుకున్నా ఆమె అంగీకరించకపోవడంతో నమస్కారాన్నే ఆమెకు సత్కారంగా అందజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎలాంటి అవార్డులు స్వీకరించడం లేదు కనుక, తనపేరిట ఆమెకు ఇవ్వ దలుచుకున్న అవార్డు మొత్తం లక్షరూపాయల నగదును హైదరాబాద్‌లోని స్వర్ణ ఆసుపత్రిలో ఆడియో థియేటర్ ఏర్పాటుకు అందజేసినట్లు బాలూ ప్రకటించారు. సంగీతం, సంస్కారం తన సహచరుల వద్ద నుంచి నేర్చుకున్నానని, వారందరి ఆశీస్సులతోనే తను ఇంతవాణ్ణయ్యానని ఆయన అన్నారు. తన గురువు కోదండపాణి పెట్టిన గానభిక్ష వల్లే తాను సినీపరిశ్రమల్లో 53 ఏళ్ళుగా ప్రయాణం సాగిస్తున్నానన్నారు. మన పరిసరాలను కాపాడుకోవాలని, 'స్వచ్ఛభారత్'ను అందరూ అనుసరించాలని బాలూ ఈ సందర్భంగా అందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలూ కుటుంబసభ్యులతో పాటు, మురళీకృష్ణ70 ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, విజేతా ఆర్ట్స్ గౌరవ ఉపాధ్యక్షుడు ఎంవివిఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.శేషగిరీశం, కార్యవర్గ సభ్యులు ఎస్.సుబ్బారావు, వై.విశ్వనాథ్, వి.చంద్రశేఖర్, డా.ఎం.సుబ్రహ్మణ్యం, జి.ఆదిశేషు, కె.అనంత్ తదితరులు పాల్గొన్నారు.

### బాలూకు 'తథాస్తు దేవతల' దీవెనలూ ఉన్నాయి - ఎస్.జానకి



గానకోకిల ఎస్ జానకి మాట్లాడుతూ, తాను ఎలాంటి పురస్కారాలు స్వీకరించడానికి ఇక్కడికి రాలేదని, బాల సుబ్రహ్మణ్యం పుట్టినరోజు కనుక బాలూను ఆశీర్వదించడానికే వచ్చానని అన్నారు. తాను ఆశీర్వదించినందువల్ల మాత్రమే బాలసుబ్రహ్మణ్యంకు ఇంతటి ప్రఖ్యాతి రాలేదని, ఆయన అసాధారణ ప్రతిభే ఆయనో గొప్పగాయకుడిగా రాణించడానికి దోహదం చేసిందన్నారు. బాలూకు ఉన్న తెలివితేటలు, అదృష్టం అన్నీ కలిసివచ్చి ఇంతటి స్థాయి లభించిందన్నారు. పట్టుదల, కృషి, మంచి జ్ఞాపకశక్తి ఇవన్నీ బాలూ ప్రతిభకు నిదర్శనాలన్నారు. అయితే తాను ఆశీర్వదించినప్పుడు, బహుశా తథాస్తు దేవతలు కూడా తథాస్తు అనడం వల్ల బాలూ గొప్ప గాయకుడై ఉంటారని ఆమె నవ్వుతూ అన్నారు. గాయకునిగానే కాక, సంగీత దర్శకునిగా, డబ్బింగ్ కళాకారునిగా, నటునిగా ఆయన విభిన్న వైశిష్ట్యాలతో ప్రేక్షకులందరినీ మెప్పించారని ఆమె ప్రశంసించారు. సంగీతదర్శకులు చెప్పిన స్వరాలను, వారు ఊహించినదానికంటే గొప్పగా పాడే ప్రతిభాపాటవాలు బాలూకు ఉన్నాయన్నారు. ఆయనకున్న స్వరజ్ఞానం, సంగీతపరిజ్ఞానం అపారమన్నారు. బాలూ సంగీతదర్శకంలోనూ తానెన్నో పాటలు పాడానని, ఆ పాటలు అద్భుతంగా ఉండి ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన గానప్రస్థానాన్ని వివరించారు. సినీరంగంలో తొలుత తనకు విషాదభరితమైన పాటలు పాడే అవకాశమే లభించిందని, అయితే పుట్టిన బిడ్డ బాగా ఏడ్చిన తర్వాతే జీవితంలో నవ్వుతూ రాణిస్తుంది కనుక, తాను కూడా అదేవిధంగా భావించి ఆ పాటలు పాడి ఎంతో మంచి పేరు తెచ్చుకున్నానన్నారు.



### అబ్బురపరచిన ప్ర'యోగా'త్మక నృత్యరూపకం

తొలుత రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ, నూజివీడు ట్రిపుల్ ఐటిలో యోగా విభాగం నిర్వాహకులు సత్యశ్రీధర్ ఆధ్వర్యంలో 27 మంది విద్యార్థులచే ప్రదర్శితమైన ప్ర'యోగా'త్మక నృత్యరూపక ప్రదర్శన ఆద్యంతం ఎంతో అద్భుతంగా ఉండి అందరినీ ఆకట్టుకుంది. ఈ అద్వితీయమైన..అపురూపమైన యోగవిన్యాసాలు జరుగుతున్నంతసేపు ప్రేక్షకులు మైమరచిపోయారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని, పవిత్రమైన గంగానదిని పరిశుభ్రంగా ఉంచుకుంటూ కాపాడుకోవాలని, స్వచ్ఛభారత్‌ను పాటించాలనే అంశాలను సూచిస్తూ అత్యద్భుతంగా చేసిన యోగా విన్యాసాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. దాదాపు అర్ధగంటకు పైగానే ఈ సాహసవిన్యాసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం అందరూ ఆ యోగ విన్యాసకులను అభినందిస్తూ చేసిన కరతాళధ్వనులతో పురమందిర ప్రాంగణం మార్మోగింది.








### ఇదంతా సాంబమూర్తిగారి పుణ్యమే - విఏకె రంగారావు

బాలసుబ్రహ్మణ్యం అద్భుతమైన భారతీయ సినిమా గాయకునిగా ఎదగడానికి కారణం ఆయన తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తిగారి పుణ్యమేనని, నెల్లూరుతోనూ, బాలూ, జానకమ్మలతో తనకున్న అనుబంధాన్ని ప్రముఖ సంగీత సాహిత్య నృత్య విశ్లేషకులు విఏకె రంగారావు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



### సంగీతం భగవంతుని భాష - భువనచంద్ర

సంగీతం అనేది భగవంతుని భాష అని, నెల్లూరు నుంచి ఆ సంగీత ప్రవాహం గంగోత్రి ప్రవాహంలా సాగి అందరినీ అలరిస్తోందని బాలూ-జానకమ్మల పాటల ప్రస్థానాన్ని ప్రముఖ సినీకవి భువనచంద్ర ఈ సందర్భంగా వివరించారు.



### పాటకు పుట్టినరోజు - వెన్నెలకంటి

ఎస్పీ బాలు పుట్టినరోజు అంటే పాటకు పుట్టిన రోజని, ఇది తెలుగుపాట పుట్టిన రోజని, భారతీయ పాట పుట్టిన రోజని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సినీకవి వెన్నెలకంటి అన్నారు. తనకు సినీపరిశ్రమలో చోటు కల్పించి తనకు అన్నివేళలా చేయూతనిచ్చింది బాలూగారేనని అంటూ, తనకు తల్లితండ్రి గురువు దైవం బాలూ గారేనన్నారు.



### ఇదెంతో అపూర్వం... అదృష్టం - జిల్లా ఎస్పీ రామకృష్ణ

సంగీతరంగంలో ఎంతో సుప్రసిద్ధులైన ఎస్.జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తదితర ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం తన అదృష్టమని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. వారి పాటలు ఎంతో సుప్రసిద్ధమైనవన్నారు.



### వారి స్వరం... మనకు వరం - తుంగా శివప్రభాత్‌రెడ్డి

బాలూ గంధర్వగానం, జానకమ్మ సమధుర స్వరం ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగిస్తుందని, వారి స్వరమే వారికో వరమని 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. నిన్నటి తరం, నేటి తరం, భావితరం.. బాలూ, జానకమ్మల పాటలతో తరిస్తున్నారని అన్నారు. గానకోకిల జానకమ్మకు నెల్లూరు మెట్టిన ఊరని, ఫన్ డాక్టర్ చంద్రశేఖరం గారి కోడలుగా ఆమె నెల్లూరుతో తన అనుబంధాన్ని ముడివేసుకుందన్నారు. భారతీయసినిమా గాయకునిగా బాలూ తన ప్రఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటుకుంటున్నారని, సింహపురికి ఇదెంతో గర్వకారణమని అన్నారు.



### బాలూ... అందరికీ ఆదర్శం - విద్యాసాగర్

వర్ధమాన సంగీతకారులందరికీ బాలూ ఆదర్శమని, ఆయనకున్న సంగీత పరిజ్ఞానం అమోఘమని ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ అన్నారు. పెద్దలను, చిన్నారులను సైతం గౌరవించే తత్వం బాలూ గారి నుంచి నేర్చుకోవాలన్నారు.

## 'ప్రభా'తం

ఎన్నికలప్పుడు నాయకులిచ్చిన వాగ్దానాలను నమ్మేస్తుండడం, తీరా ఆ వాగ్దానాలు ఉత్తుత్తివే అని తేలినప్పుడు ఆవేదన చెందుతుండడం మనకు కొత్తేమీ కాదు. నమ్మించడం వారి వంతు.. నమ్మడం మన వంతు. ఇది ఎంతోకాలం నుంచి వస్తున్న తంతు. ప్రజలను ఏదోవిధంగా మభ్యపెట్టి పదవు లందుకోవాలనే తపనే ఇప్పుడు నాయకుల్లో అధికమవుతూ ఉండడం అందరికీ తెలిసిందే. చెప్పిన మాట నిలబెట్టుకోవడం అన్నది ఈ కాలానికి విరుద్ధమో ఏమో!. లేక, కలికాలపు రాజకీయాలు ఇలాగే ఉం టాయో ఏమో మరి!..మనదేశంలో ఇలాంటి వైఖరులవల్లే సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. ఇప్పుడు ఉత్తరాదిన జరుగుతున్నది కూడా ఇదే. అక్కడ రైతులోకం ఇప్పుడు తీవ్ర ఆగ్రహంలో ఉంది. కారణం, అక్కడి ప్రభుత్వాలు తమ న్యాయమైన కోరికలు తీర్చడం లేదనే. ఏళ్ళు గడుస్తున్నా నాయకులిచ్చిన హామీలు నేటికీ నెరవేర్చడం లేదనే.

ఈ నెల1 నుంచి ఉత్తరాదిలో మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణాల్లో రైతులతో పాటు ఛత్తీస్‌ఘడ్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో కూడా రైతులు పెద్దఎత్తున ఆందోళన బాట పట్టారు. ఈ నెల 5 నుంచి రైతుల ఆందోళన మరింత ఉధృతం చేయాలని, 10న భారత్ బంద్ కూడా చేపట్టనున్నామని అఖిలభారత కిసాన్ సభ ప్రకటించింది కూడా. గత నెలలో ఇచ్చిన ఏ హామీనీ మహారాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, అందు వల్ల రైతుల ఆందోళన ముమ్మరం చేయాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. అనేక రాష్ట్రాల్లో రైతులు తమ బాధలు తీరుతాయని ఇంతకాలంగా ఎదురుచూసి విసిగిపోయారు. ఇక ఏ దారీ లేక రోడ్డెక్కి ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. ఎంతో కష్టపడి పండించుకున్న పంటను, కూరగాయల్ని తెచ్చి అసహనంతో రోడ్ల మీద కుమ్మరించేసి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కూరగాయల ధరలు ఆకాశానికంటుతున్నాయి. చివరికి పాలసరఫరా కూడా నిలిచిపోవడంతో పట్టణాలు, నగరాల్లోని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రైతుల కోరికలు కూడా న్యాయమైనవే. అవి గొంతెమ్మ కోరికలేమీ కాదు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, అన్నదాతలకు కనీస ఆదాయ పథకం అమలుచేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేసి తమ కష్టాలు తీర్చాలని, ఎరువుల ధరలు తగ్గించాలని వగైరా డిమాండ్లను నెరవేర్చాలని రైతులు ఎంతోకాలంగా కోరుతున్నారు. వాటిని 'తప్పకుండా నెరవేరుస్తాం'..అని నాయకులు ఎప్పుడో హామీలు కూడా ఇచ్చివున్నారు.

అయితే, ఎప్పటికప్పుడు దాటవేత ధోరణితో రైతులను వారు అసహనానికి గురిచేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఇక సమ్మె చేస్తే తప్ప తమ సమస్యల సాధనకు ప్రభుత్వాలు కదలవని రైతుసంఘాలతో కలసి రైతన్నలంతా సమ్మెకు సిద్ధమయ్యారు. దాదాపు వందకు పైగానే రైతు సంఘాలు కిసాన్ మహాసంఘ్ (ఆర్‌కెఎమ్)గా ఏర్పడి రైతులకు రుణమాఫీ, మద్దతు ధర పెంపు తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మెలోకి దిగాయి. గ్రామీణప్రాంతాల రైతాంగం కూడా సమ్మెకు మద్దతునిస్తుండడంతో దేశవ్యాప్తంగా మార్కెట్లు మరింత సంక్షోభంలో పడ్డాయి. పదిరోజులపాటు పట్టణాలు, నగరాలకు పాలు-కూరగాయలు బంద్ అంటే తట్టుకోవడం కష్టమే! ఇప్పటికే ఢిల్లీలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అయితే, ఇక్కడ మరో విచిత్రమైన విషయం ఏమిటంటే. రైతులు తమ బాధలు తీరడం లేదంటూ కడుపుమండి రోడ్డెక్కితే...'ఇదంతా వారు కేవలం ప్రచారం కోసమే చేస్తున్నారంటూ' కేంద్రంలోని ఒక మంత్రి అంటే, మరో మంత్రి ఇదంతా 'ఒక పబ్లిసిటీ స్టంట్' అంటూ బిజెపి మంత్రులు ఎకసక్కాలు పడుతుండడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లవుతోంది. కేంద్రంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు రైతులను ఇలా అవహేళనగా మాట్లాడుతుండడం రైతుల్లోనే కాదు, ప్రజల్లోనూ సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 'అధిక వ్యవసాయ దిగుబడుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది దంటూ' మరో మంత్రి వింత వాదన రైతులను మరింత చిర్రెత్తిస్తోంది. 'వాళ్లకి మరో పనేమీ లేదు. అర్థంపర్థం లేని ఆందోళన చేస్తున్నారు. పదిరోజుల పాటు వారు ఉత్పత్తులు అమ్ముకోకపోతే ఎవరికి నష్టం.. రైతులకే కదా'.. అంటూ హర్యానా ముఖ్య మంత్రి రైతులపై, రైతు సంఘాలపై విరుచుకు పడుతుండడం దేన్ని సూచిస్తున్నదో కేంద్రంలోని రాజకీయ విజ్ఞులకే తెలియాలి. కేంద్రం కూడా రైతు లకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, వారి సమస్యలకు స్పందించక, ఏలినవారే నేరుగా విమర్శలకు దిగు తుండడం వింతపోకడ కాక ఏమవుతుంది?.. ఇలాంటి వాటివల్ల రైతుల నుంచి, ప్రజల నుంచి వ్యతిరేకతనే ఆ నాయకులు 'మూట'కట్టుకోవాల్సి వుంటుంది తప్ప చివరికి సాధించేదేమీ వుండదు.

ఏదేమైనా రైతులకు అన్నివిధాల అండగా ఉంటామని చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వంలో, ఏళ్ళు గడుస్తున్నా రైతుల బతుకుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం ఎంతో విచారకరం!...రైతుల రుణమాఫీ పథకాలు ఒక ప్రహసనంగా మారుతుండడం ఎంతో బాధాకరం!.. రైతుల కష్టాలు తీర్చకుండా... రైతులనే హేళనగా మాట్లాడుతుండడం దారుణం!.. ఇకనైనా అలాంటి తీరు మారాలి. రైతుల కష్టాలు తీర్చేందుకు ఇప్పటికైనా ప్రభుత్వాలు దిగిరావాలి. ఆరుగాలం కష్టించి పంట పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. దళారుల మాయాజాలం నుంచి, బడా వ్యాపారుల మోసాల నుంచి రైతులను రక్షించాలి. స్వామినాధన్ కమిటీ సిఫార్సులను అమలుచేసి వెంటనే రైతుల బాధలు తీర్చాలి. రైతు సౌభాగ్యమే.. దేశ సౌభాగ్యం కనుక... అందరికీ అన్నం పెట్టే అన్నదాతలను అన్ని విధాలా ఆదుకునేందుకు అటు నాయకులు, ఇటు పాలకులు, ప్రభుత్వాలు అందరూ కృషిచేయాలి. ఆ కృషి కూడా పదికాలాలపాటు కృషీవలురకు మేలుబాటులు పరిచేదిగా ఉండాలి. అప్పుడే రైతుకు మంచి చేసినట్లవుతుంది!...తద్వారా దేశానికీ మేలు జరుగుతుంది!..

### రైతుకు ఎంత మంచి చేస్తే.. అంత మేలు!

**రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో రైతులు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో రైతు ఉద్యమం ఉధృతమవుతోంది. ఎంతో కష్టపడి పండించుకున్న ఉత్పత్తులను తెచ్చి రోడ్ల మీద పారబోసి రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధరలు ఆకాశానికంటుతున్నాయి. పాలు, కూరగాయలు దొరక్క జనం అవస్థపడుతున్నారు. ఇకనైనా, ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతన్నల సమస్యలు తీర్చాలి. అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవాలి.**

---

## వరి దిగుబడిలో నెల్లూరే ఫస్ట్

**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**



ఈ రబీ సీజన్‌లో వరి పంటలో సరాసరి హెక్టార్‌కు 6711 కేజీల దిగుబడి సాధించి దేశం లోనూ, రాష్ట్రంలోనూ జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

2017-18లో రబీలో 218693 హెక్టా ర్లలో వరి, 4535 హెక్టార్లలో వేరుశనగ, 4634 హెక్టార్లలో పొగాకు, 2349 హెక్టార్లలో పప్పు దినుసులు సాగుచేయడం జరిగిందని పేర్కొ న్నారు. అదేవిధంగా రైతు రుణమాఫీకి సంబం ధించి 736 కోట్లను రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగిందని, వేట నిషేధ సమయంలో ఈ నాలు గేళ్ళలో 48881 మత్స్యకార కుటుంబాలకు 12 కోట్ల రూపాయలు భృతిగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. మత్స్య కారుల సంక్షేమపథకం ద్వారా 32కోట్లు సబ్సిడీ మంజూరుచేశామని, తాగునీటి సరఫరాకు సంబంధించి నాలుగేళ్ళలో 23.88కోట్లు వెచ్చించి, 188 ప్రాంతాలకు తాగునీరు అందిం చడం జరిగిందన్నారు. 71 ఫ్లోరైడ్ ప్రాంతాల్లో 5.84 కోట్లతో కమ్యూనిటీ ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, 200 గిరిజన ప్రాంతాల్లో 3కోట్లు ఖర్చు చేసి బోరింగ్‌లు, మంచినీటి పథకాలు ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాను కరువు రహిత జిల్లాగా తీర్చిదిద్దేం దుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ ఆర్.ముత్యాల రాజు వివరించారు.

## కమనీయం శ్రీవారి కళ్యాణోత్సవం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించు కుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచారపరిషత్, హిందూధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నెల్లూరు దర్గామిట్ట టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. టిటిడి వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి తిరుమంజనం, అభిషేకాలతో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాలతో భక్తుల గోవిందనామ స్మరణలతో కళ్యాణం జరిపారు. అనంతరం పుష్పయాగమహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి. హిందూధర్మ ప్రచార పరిషత్ హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు పర్యవేక్షించారు.

---

### దీక్షల పేరుతో దుబారా!

నవనిర్మాణ దీక్షలకంటూ రాష్ట్ర ప్రభుత్వం 13కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. ఇది దుబారా తప్ప ఇంకోటి కాదు. ఈ దీక్షలతో రాష్ట్రానికేమన్నా ఉపయోగం వుందా? ట్రాఫిక్ సమస్యలు సృష్టించడం తప్పితే ప్రయోజనం వుందా? అసలు నవనిర్మాణదీక్షలు చేయాల్సిన పనేముంది? అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రానికి ఇలాంటి ఆడంబరాలు అవసరమా?

**- ఎస్.కె.మీరావలి, నెల్లూరు.**

### ఆయన వెళితే తప్పేంటి?

మాజీరాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ సదస్సులో పాల్గొనడానికి అంగీకరించడాన్ని చాలామంది విమర్శిస్తున్నారు. వీళ్ళంతా కుహనా లౌకికవాదులే! మేధావుల ముసుగులు తగిలించుకున్న వాళ్ళే! ఆరెస్సెస్ ఐఎస్ఐ, లష్కరేతోయిబా వంటి తీవ్రవాద సంస్థ కాదుకదా! జాతీయవాద సంస్థ. జాతీయ జెండాను గౌరవించే సంస్థ. భారతమాతను పూజించే సంస్థ. ఉగ్రవాద సంస్థల మద్దతుదారులతో కలిసి సభలు, సమావేశాలలో పాల్గొనేవాళ్ళు కూడా ఆరెస్సెస్‌ను వేలెత్తిచూపేవాళ్ళయ్యారు.

**సి. రాజీవి, నెల్లూరు.**

### పచ్చమీడియా ఏడుపేంటి?




గుజరాత్‌లో ధొలెరా అనే ప్రత్యేక నగరాన్ని 3వేల కోట్లతో నిర్మిస్తున్నారని చంద్రబాబు అనుకూల పచ్చమీడియా ఒకటే ఏడుపులు, పెడబొబ్బలు పెడుతోంది. ధొలెరా సిటీని నిన్నో మొన్నో మొదలుపెట్టలేదు కదా. ఎప్పట్నుండో కడుతున్నారు కదా! మరి నాలుగేళ్ళుగా ఈ పచ్చమీడియా కళ్ళు మూసుకుని వుందా? అది కూడా వాళ్ళు కట్టేది గుజరాత్ రాష్ట్ర నిధులతోనే! కేంద్రం తన వాటా సాయం చేస్తుందంతే! ధొలెరాలో నిర్మించే ప్రాంతం పూర్తిగా మెట్టభూమి ప్రాంతం. అక్కడి భూములు వ్యవసాయ యోగ్యం కావు. అలాంటి సిటీలో పారిశ్రామికాభివృద్ధి వేగంగా జరుగుతుంది. పరిశ్రమలకు చౌకధరలకు భూమివ్వవచ్చు. ఇక్కడ రైతులు నష్టపోయేదేమీ లేదు. అదీగాక అక్కడి ప్రభుత్వంలో నిజాయితీ వుంది కాబట్టి పెట్టుబడిదారులు ధైర్యంగా వస్తారు. అమరావతిలో ఎవరన్నా పెట్టుబడులు పెడదామని వస్తే 'నాకేంటి' అనే పరిస్థితి ఈ రాష్ట్రంలో వుంది. అన్నీ పంట భూములే. ఇక్కడ భూముల రేట్లు కూడా అదిరిపోతున్నాయి.

మనం కూడా మెట్ట ప్రాంతంలో ఒక కొత్త సిటీని మొదలుపెట్టి వుంటే అన్నీ అనువుగానే వుండేవి. అమరావతి పేరుతో చంద్రబాబు బిల్డప్ రాజధాని మొదలుపెట్టాడు. కాబట్టే అది ముందుకు పోకుండా ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుంది. మనం కట్టలేకపోగా ఇంకోడి మీద పడి ఏడవడం దేనికి?

**పైడేరు శ్యాంప్రసాద్, వెంకటగిరి.**



# తమ్ముడు తోడొచ్చేనా?

మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి త్వరలో వైసిపిలో చేరనున్నట్లు తెలుస్తోంది. మరి ఆయనతో పాటు ఆయన కుటుంబసభ్యులు ఇంకెవరెవరు పార్టీలో చేరనున్నారన్నది ప్రశ్నగా మారింది. నాలుగో సోదరుడైన ఆనం విజయ కుమార్‌రెడ్డి ఆల్‌రెడీ వైసిపిలోనే వున్నాడు కాబట్టి ఆయనతో పనిలేదు. ఇక స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి కొడుకులైన ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలు తెలుగుదేశం లోనే వున్నారు. ఇక తండ్రి చనిపోవడంతో రాజకీయంగా కూడా వారికి పెద్దదిక్కు చిన్నాన్న అయిన రామనారాయణరెడ్డే! రామనారాయణరెడ్డి వైసిపిలో చేరితే టీడీపీలో వుండి వీళ్ళు స్వయంగా ఎదిగే పరిస్థితి వుండదు. అదీగాక తెలుగుదేశంలో వున్నప్పుడే ఆనం వివేకాకు అన్యాయం జరిగింది. ఆయనకు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్సీని ఇవ్వకుండా అసంతృప్తికి గురి చేసారు. ఈ బాధ ఆయన కొడుకుల్లోనూ వుంది. కాబట్టి రామనారాయణరెడ్డితో పాటే వాళ్ళు వైసిపిలో చేరే అవకాశాలెక్కువ.

పోతే ఆనం జయకుమార్‌రెడ్డి పరిస్థితి ఏంటన్నదే ప్రశ్న! 2014 ఎన్నికలకు ముందే ఆయన తన సోదరులతో విడిపోయాడు. అప్పుడు జైసమైక్యాంధ్ర అభ్యర్థిగా నిలబడ్డాడు. ఎన్నికల తర్వాత తెలుగుదేశంలో చేరి మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో ఎంతో సన్నిహితంగా వ్యవహరిస్తున్నాడు. అప్పటినుండి ఆనం వివేకా, రామనారాయణరెడ్డిలతో దూరం పాటిస్తూ వచ్చాడు. ఈరోజు వివేకా లేడు, రామనారాయణ రెడ్డితో జయకు పెద్ద విభేదాలేమీలేవు. ఇటీవల రామనారాయణరెడ్డి పార్టీ మారుతున్నాడన్న ప్రచారం జరిగినప్పుడు కూడా జయకుమార్‌రెడ్డి చంద్రబాబును కలిసి తాను తెలుగుదేశంలోనే వుంటానని చెప్పొచ్చాడు. ప్రస్తుతానికి ఆయనతో కలిసి తెలుగుదేశంలో కొనసాగుతున్న జయకుమార్‌రెడ్డి తన అన్నతో కలిసి వైసిపిలో చేరే అవకాశాలు లేవు. భవిష్యత్‌లో ఆయన రాజకీయంగా ఎటువైపు అడుగులు వేసినా ఆదాలతో కలిసే నడుస్తాడని తెలుస్తోంది.

# వైకాపాలో కుటుంబ రాజకీయం

## లోక్‌సభకా? శాసనసభకా?

**నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మొదటగా చేరింది, మొదటి నుండి జగన్‌కు అండగా నిలిచింది మేకపాటి కుటుంబం. పెద్ద రాజకీయ కుటుంబాలేవీ జగన్ వెంట రాకున్నా ఆయన పార్టీ పెట్టిన కొత్తల్లో కాంగ్రెస్‌పార్టీ ఎంపీగా వున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా వున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు కాంగ్రెస్‌ను వీడి జగన్ వెంట నడిచారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఇది గొప్ప విషయమే!**







అంతకుముందే కోవూరు ఎమ్మెల్యేగా వున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం జగన్ వెంట నడవడం, ఉపఎన్నికల్లో గెలుపొందడం తెలిసిందే! మేకపాటి సోదరులు కూడా జగన్‌ను నమ్మి తమ పదవులు వదులుకున్నారు. 2012లో జరిగిన ఉపఎన్నికల్లో వైసిపి అభ్యర్థులుగా తిరిగి గెలుపొందారు. 2014 ఎన్నికల నాటికి జిల్లా పార్టీలో వారే పెద్ద దిక్కుగా వ్యవహరించారు కాబట్టి నెల్లూరు ఎంపీ స్థానంతో పాటు ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీ సీట్లు వాళ్ళకే ఇచ్చారు. నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ నుండి మేకపాటి గౌతంరెడ్డిలు విజయం సాధించగా, ఉదయగిరి అసెంబ్లీ నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పరాజయం పాలయ్యాడు.

ఇప్పుడు పార్టీలోకి మరికొందరు నాయకులు వస్తున్న నేపథ్యంలో గతంలోలాగే మేకపాటి కుటుంబానికి మూడు సీట్లు ఇచ్చే పరిస్థితి వుందా? అన్న ప్రశ్న ఉదయించింది. ఆ కుటుంబంలో ఇద్దరికి సీట్లు గ్యారంటీ అంటున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి టిక్కెట్లు ఇస్తే కుటుంబ పార్టీగా ముద్రపడుతుందనే అభిప్రాయం కూడా వుంది. బయట నుండి వచ్చినవారికి సీట్ల విషయంలో ప్రాధాన్యతనివ్వాలి. సీట్ల అడ్జస్ట్‌మెంట్ జరగాలి. కాబట్టి మేకపాటికి వున్న 3 సీట్లు 2 సీట్లకు తగ్గొచ్చు. ప్రస్తుతమున్న ముగ్గురిలో ప్రత్యక్ష ఎన్నికల రంగం నుండి ఎవరు తప్పుకుంటారన్నది ఇక వాళ్ళే నిర్ణయించుకోవాలి.

ఇక ప్రస్తుతం ఎంపీగా వున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి మళ్ళీ కూడా పోటీ చేయడం ఖాయం. నిన్నటివరకు ఆయన పేరు నెల్లూరు లోక్‌సభకే వినిపించింది. తాజా వార్తల ప్రకారం ఆయనను అసెంబ్లీకి పోటీ చేయించాలనే ఆలోచనలో ఆయన కొడుకు గౌతంరెడ్డి వున్నట్లు తెలుస్తోంది. ఈసారి పార్టీ అధికారంలోకి వస్తుంది. రాజమోహన్‌రెడ్డిని అసెంబ్లీకి గెలిపించి జగన్ కేబినెట్‌లో మంత్రిని చేయాలి. ఆయన సీనియర్ కాబట్టి మంత్రి పదవి ఇవ్వడం పెద్ద సమస్య కూడా కాదు. ఈ ఎలక్షన్ తర్వాత ఇక ఆయన పోటీ చేసే పరిస్థితి వుండదు. లోక్‌సభకు గెలిపించినా ఈసారి కేంద్రంలో ఏ ప్రభుత్వం వస్తుందో, అక్కడ పరిస్థితులు ఎలా వుంటాయో తెలియదు. రాష్ట్రంలో మాత్రం అధికారం వచ్చే అవకాశాలున్నాయి. కాబట్టి తన తండ్రిని అసెంబ్లీకి పంపి తాను లోక్‌సభకు పోటీ చేయాలనే ఆలోచనలో గౌతంరెడ్డి వున్నట్లు తెలుస్తోంది.



'వంచనపై గర్జన దీక్ష' సభలో మాట్లాడుతున్న ఒంగోలు ఎం.పి వై.వి.సుబ్బారెడ్డి





ర్యాలీ నిర్వహిస్తున్న నెల్లూరు నగర నియోజకవర్గ వైసిపి నాయకులు

# వంచన పై యుద్ధం

- నెల్లూరు వీఆర్ హైస్కూల్ మైదానంలో 'వంచనపై గర్జన'
- 13జిల్లాల నుండి వైసిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు

ప్రత్యేకహోదా విషయంలో రాష్ట్ర ప్రజలను వంచించిన తెలుగుదేశం ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 2వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు వీఆర్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన 'వంచన పై గర్జన దీక్ష' సభ విజయవంతమైంది.

రాష్ట్రంలోని 13జిల్లాల నుండి వైసిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సమన్వయకర్తలు, నాయకులు దీక్ష సభకు తరలివచ్చారు. అలాగే జిల్లాలోని 10అసెంబ్లీ నియోజక వర్గాల నుండి వైసిపి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సభా వేదికపై నాయకులు నలుపుదుస్తులు ధరించి తమ నిరసన తెలిపారు. ఉదయం 9గంటలకు మొదలైన సభ సాయంత్రం 5గంటలకు ముగిసింది. మండుటెండతో మొదలైన కార్యక్రమాన్ని సాయంత్రం చిరుజల్లుల అక్షింతలతో ముగించారు. సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన దివంగత నేత వై.యస్. విగ్రహానికి నాయకులు నివాళులర్పించి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వై.యస్. అవినాష్‌రెడ్డి, వి.వరప్రసాద్, వై.వి.సుబ్బారెడ్డిలతో పాటు పార్టీ జిల్లా పరిశీలకులు సజ్జల రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం, పార్థసారథి, అంబటి రాంబాబు, నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేలతో పాటు ఇతర జిల్లా వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్దసంఖ్యలో సభకు విచ్చేసారు. దాదాపు 50మంది నాయకులు సభలో ప్రసంగించారు. చంద్రబాబు ప్రభుత్వంపై పదునైన విమర్శలతో దాడి చేసారు. దాదాపు 8గంటల పాటు దీక్షా కార్యక్రమం జరిగినప్పటికీ వెళ్ళే జనాలు వెళ్తావున్నా ఎప్పటి కప్పుడు వస్తున్న వైయస్ఆర్ అభిమానులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం ఎప్పుడూ నిండుగా కనిపించింది.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## నామకరణ దినోత్సవం సరే...
# ఆచరణ ఏదీ



శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కె.వి.చలమయ్య

నెల్లూరుజిల్లాకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టి పదేళ్ళయ్యింది. దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాలోని ఆర్యవైశ్యుల కోరికమేరకు నెల్లూరుజిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టి అసెంబ్లీలో ఆమోదింపజేశారు. ప్రస్తుతం ఏపిలో వ్యక్తుల పేర్ల మీద మూడే మూడు జిల్లాలున్నాయి. ఒకటి ప్రకాశం, రెండోది వై.యస్.ఆర్.జిల్లా(కడప), మూడోది పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా. అయితే రాష్ట్రంలో ప్రకాశం జిల్లా పాపులర్ అయినంతగా మిగతా రెండు జిల్లాలు పాపులర్ కాలేదు. ప్రకాశం అనే పేరు పలకడానికి సులభంగా వుంటుంది. వై.యస్.ఆర్.జిల్లా కూడా ఇప్పుడిప్పుడే వాడుకలో పడుతుంది. కాని నెల్లూరుకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టి పదేళ్ళయినా కూడా ప్రభుత్వ రికార్డులు, ప్రభుత్వ అధికార పత్రాలలో కనపడినంతగా పబ్లిక్‌లో పాపులర్ కాలేదు. దీనికి పేరు కొంచెం పొడుగ్గా వుండడమే కారణం కావచ్చు. ఏదిఏమైనా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలనే పణంగా పెట్టిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని కనీసం ఆయన పేరు పెట్టిన జిల్లాను ఉచ్చరించడం వల్లనైనా గౌరవిద్దాం.

నెల్లూరుజిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టి పదేళ్ళయిన సందర్భంగా ఈ నెల 4వ తేదీన నెల్లూరు, ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ పి.చెంచలబాబుయాదవ్, డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని అమరజీవికి నివాళులర్పించారు.



# నెల్లూరు కబుర్లు

## లబ్... డబ్బు...

• తెరచుకోనున్న విద్యా సంస్థలు



వేసవి సెలవులు అయిపోవచ్చాయి. ఈ నెల 11 నుండే జిల్లాలోని పాఠశాలలన్నీ పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 1వ తేదీ నుండే జూనియర్ కళాశాలలు తెరచుకున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పూర్తయ్యి క్లాసులు కూడా ప్రారంభమయ్యాయి. ఇక స్కూల్స్ ప్రారంభమైతే తల్లిదండ్రులకు వచ్చే సమస్యలు ఎలాగూ రాకమానవు. స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్, బూట్లు... వీటికి డబ్బులను ఎత్తిపెట్టాలి. ప్రతి ఏటా మధ్యతరగతి ప్రజలకు ఇదో సమస్య. ప్రైవేట్ పాఠశాలల్లో పోటాపోటీగా అడ్మిషన్లు జరుగుతున్నాయి. పాఠశాలలు తెరచుకుంటే ఒకటిన్నర నెలలుగా విశ్రాంతిలో వున్న స్కూలు బస్సులు మళ్ళీ రోడ్లపై విహరిస్తాయి.

## మీ-సేవను ఉపయోగించుకోండి

- 'నుడా' శీనయ్య



'మీ-సేవా' కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ప్రజలు 'మీ-సేవా కేంద్రాల' సేవలను వినియోగించుకోవాలని, ప్రతి అయిదువేల జనాభాకు ఒక మీ-సేవ కేంద్రాన్ని ప్రభుత్వం అనుమతించి అందుబాటులోకి తెస్తున్నదని 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. నెల్లూరులోని బాలాజీనగర్‌లో ఈనెల 1న ఆయన 'మీ-సేవ' కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శీనయ్య మాట్లాడుతూ, అన్ని రకాల బిల్లుల చెల్లింపులను సులభంగా చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ అంచూరు జానకి తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ సి.సి బదిలీ

నెల్లూరు మేయర్ సి.సి రాజేంద్రను మున్సిపల్ జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. అలాగే పురసేవ కేంద్రాల బాధ్యతలను అదనంగా అప్పగించారు. మూడున్నరేళ్ళుగా ఆయన మేయర్ సి.సిగా వ్యవహరిస్తూ విశ్వాసపాత్రుడిగా ముద్రపడ్డాడు. మేయర్ వద్ద వున్న చనువుతోనే తనకు సంబంధం లేకపోయినా పలు విభాగాలలో వేలు పెట్టాడనే ఆరోపణలున్నాయి. ఇటీవల స్టాండింగ్ కమిటీ సభ్యుల నామినేషన్ల విషయంలోనూ ఆయన మేయర్‌కు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు రావడంతో ఆయనపై బదిలీ వేటు పడింది.

## 'నీట్'లో అంతంత మాత్రం

మెడికల్ కాలేజీలలో ప్రవేశం కోసం మే 6వ తేదీన నిర్వహించిన 'నీట్' పరీక్షల ఫలితాలను ఈ నెల 4వ తేదీన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 2006మంది విద్యార్థులు 'నీట్'కు హాజరుకాగా, 60శాతం మంది అర్హత మార్కులు సాధించారు. బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వంటేరు సాయివెంకటహర్షవర్ధన్‌రెడ్డి నీట్‌లో జాతీయ స్థాయి 14వ ర్యాంకును సాధించాడు. ఈ ఏడాది ఎంసెట్‌లోనూ ఈ అబ్బాయి రాష్ట్ర స్థాయి పదో ర్యాంకును సాధించి వుండడం విశేషం. ఇక వికలాంగుల కోటాలో నూతేటి పావని జాతీయ స్థాయి 17వ ర్యాంకును సాధించింది. అలాగే గంజి వీరప్రశాంతి 830వ ర్యాంకును సాధించింది. వందలోపు ర్యాంకు జిల్లాకు ఒకటే వచ్చింది. నెల్లూరుతో పాటు తిరుపతి ఇతర సెంటర్‌లలో నెల్లూరుజిల్లా వాళ్ళు 5వేల మంది దాకా 'నీట్' రాయగా అరకొర ఫలితాలు మాత్రమే సాధించారు.

• విశ్వసాయి లక్ష్యం

## విద్యలో నాణ్యత... విద్యార్థి భవిష్యత్‌కు భద్రత






విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతున్న విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ

నాణ్యమైన విద్య, విద్యార్థులకు బంగారు భవిష్యత్తే విశ్వసాయి విద్యాసంస్థల లక్ష్యమని ఆ సంస్థల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కాలేజీ ప్రాంగణంలో అధ్యాపకులు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులతో పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి వుంటుందని, ఆ ప్రతిభను వెలికితీసి మెరుగుపెట్టే చదువుల వేదికే విశ్వసాయి కళాశాల అని చెప్పారు. గత ఏడేళ్ళుగా మెడికల్, ఇంజనీరింగ్, ఇతర కాంపిటేటివ్ పరీక్షల్లో కళాశాల సాధించిన విజయాలను ఆయన వివరించారు. సంస్థ వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యకు తమ కళాశాల అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈరోజు కష్టపడితే రేపటి రోజు మనదేనని, భవిష్యత్‌ను ఎంతో అందంగా మలచుకోవచ్చునని చెప్పారు.

## విఆర్‌ఓల బదిలీ

జిల్లా రెవెన్యూ శాఖలో ప్రక్షాళన దిశగా జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు కసరత్తు చేస్తున్నాడు. ఈ పరంపరలో భాగంగానే ఒకేసారి 91మంది విఆర్‌ఓలను వారి వారి స్థలాల నుండి కదిలించాడు. వారిని కొత్త స్థానాలకు బదిలీ చేస్తూ డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేసారు.

## మెడికల్ కాలేజీకి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్

నెల్లూరులో ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభును తిరుపతికి బదిలీ చేసారు. అనస్థీషియా విభాగం హెచ్ఓడిగా వున్న డాక్టర్ నిర్మలను ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది.

## పశుసంవర్ధకశాఖ జేడీగా విజయమోహన్

జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పశ్చిమగోదావరి జిల్లా జేడీగా పనిచేస్తున్న డా.జి.విజయమోహన్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఈ నెల 2న ఉత్తర్వులు జారీచేసింది. విజయమోహన్‌ను ఆ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేయడంతో ఈ ఏడాది మార్చి 13 నుంచి మే13వ తేది వరకు సెలవులో ఉన్నారు. కాగా, ప్రభుత్వం ఆయనను నెల్లూరు జేడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## కొంచెం ఉపశమనం

మే నెల పోయి జూన్‌లోకి వచ్చాము. మే చివరి వారంలో ఎండలు తాట తీసాయి. ఈ నెలలో కూడా ఆ ఎండలు కాసుంటే జనాలు పిట్టల్లా రాలిపోయుండే వాళ్ళు. ఎట్లాగో వాతావరణం కొంచెం చల్లబడింది. ఒకరోజు చిరు జల్లులు కూడా పడ్డాయి. కొంతవరకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. కాబట్టి కొంచెం ఉపశమనం లభించినట్లయ్యింది.

## నిరుద్యోగ భృతి హర్షణీయం



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు

రాష్ట్రంలో పేద నిరుద్యోగులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రతి ఏడాది రూ.1200 కోట్ల నిధులతో 10లక్షల మందికి నిరుద్యోగభృతిని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనీయులని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమలనాయుడు అన్నారు. ఈ నెల 2న నెల్లూరు ఆర్ఆర్ వీధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరుద్యోగులను ఆదుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనివల్ల ప్రతి నిరుద్యోగికి లబ్ది చేకూరుతుందన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం, బ్యాంకు ద్వారా నిరుద్యోగ భృతి జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ అమ్మల్లా, నగర కార్యదర్శి అఖిల్, మణిదీప్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న జడ్పీ వాకర్స్ సంఘం సభ్యులు

పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు నిర్వహించిన పర్యావరణ ర్యాలీలో ఈ నెల 5న జడ్పీ వాకర్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ విఆర్‌సి మైదానం నుండి బయలుదేరి ఏసి స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం వక్తలు ప్లాస్టిక్ వాడకంపై, చెట్ల పెంపకంపై మాట్లాడారు. ఈ ర్యాలీలో అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జె.యస్.ఆర్.ఆంజనేయులు, ప్రచార కార్యదర్శులు మండవ శ్రీనివాసరావు, వి.ఎస్.ప్రసాద్, ఆర్.నాగేశ్వరరావు, సభ్యులు యు.చెంచయ్య, హర్షవర్ధని, సుజన, విద్యావతి, హరిసుధ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో స్వచ్ఛభారత్

నెల్లూరు పెద్దాసుపత్రిలో ఈ నెల1న స్థానిక నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'మన ఆసుపత్రి-మన ఆరోగ్యం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. రామకృష్ణ సేవాసమితి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి, రోటరీక్లబ్ సభ్యుడు టి.వెంకటేశ్వర్లు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజుతో పాటు ఎన్‌వి సుబ్బయ్య, కె.ప్రవీణ్, కె.పవన్ తదితరులు పాల్గొన్నారు.



# పుట్టాకు ఆత్మీయ సత్కారం!

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు 3వ తేదీ నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో యాదవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. యాదవ సోదరులు భారీఎత్తున తరలివచ్చి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గజమాలలు, శాలువాలు, పూలకిరీటాలతో ముంచెత్తారు. యాదవ యువకులు పుట్టాకు వెంకటేశ్వరపురం వద్ద ఘనస్వాగతం పలికి కస్తూర్బా కళాక్షేత్రం వరకు వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రంలో నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజధాని కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు, ఏపిఐఐసి ఛైర్మెన్ పి.కృష్ణయ్య, యాదవ ప్రముఖులు వంకి పెంచలయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం, ఎస్.వి.నారాయణయాదవ్, తులసీరాం యాదవ్, కృష్ణయాదవ్, ఎం.మురళీకృష్ణయాదవ్, నూనె మల్లికార్జున, వేల్పుల రజని, రావుల జ్యోతి, పద్మజ, పుట్టా సుబ్రహ్మణ్యం, హరిబాబుయాదవ్‌లు పాల్గొని పుట్టా సుధాకర్‌యాదవ్ శ్రీవారి సేవలో తరించాలని, యాదవ జాతికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

### సెజ్ పాలసీ కమిటీ సభ్యులుగా

# శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి



దేశంలో సెజ్ విధివిధానాల అధ్యయనం కోసం ఏర్పాటు కాబడ్డ నూతన సెజ్ పాలసీ కమిటీ సభ్యులుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కళ్యాణి నేతృత్వం వహిస్తున్న 15మంది సభ్యుల కమిటీలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల పరిశ్రమలశాఖ ప్రధాన కార్యదర్శులు వున్నారు. నిర్దేశించిన సూచనల ప్రకారం, ఈ కమిటీ సెజ్ విధానాన్ని విశ్లేషిస్తుంది. ప్రస్తుత దేశ ఆర్థిక నేపథ్యంలో ఎగుమతిదారుల అవసరాలను తీర్చడానికి ప్రపంచ వాణిజ్య సంస్థకు అనుకూలంగా సెజ్ విధానం తయారుచేస్తుంది. సెజ్ విధానంలో దిద్దుబాటును సూచిస్తుంది. అన్ని పథకాలకు అనుకూలమైన సెజ్ విధానాన్ని, తులనాత్మక విశ్లేషణను తయారు చేస్తుంది. ఈ కమిటీ 3 నెలల్లో తన సిఫార్సులను సమర్పించాల్సిన అవసరం ఉంది.

కాగా, రవీంద్ర సన్నారెడ్డి నాయకత్వంలోని శ్రీసిటీ, 8 సంవత్సరాల కన్నా తక్కువ కాలంలో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీగా అవతరించింది. దీని పరిధిలో ఒక ప్రత్యేక ఆర్థికమండలి, దేశీయ ఉత్పత్తుల వాణిజ్య కేంద్రం, స్వేచ్ఛా వ్యాపారం మరియు గిడ్డంగి మండలం, ఒక ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ వున్నాయి. ఇసుజు, క్యాడ్బరీ, పెప్సికో, కోల్గేట్ పామోలివ్, కోబెల్కో, కెల్లాగ్‌తో పాటు, 27 దేశాలకు చెందిన 170 ప్రముఖ బ్రాండ్లకు శ్రీసిటీ పుట్టినిల్లుగా మారింది.

# పర్యావరణంపై వేటు... ప్రపంచానికి చేటు




ర్యాలీ నిర్వహిస్తున్న కృష్ణపట్నం పోర్టు సిబ్బంది

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీ ఉదయం నెల్లూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణపట్నం పోర్టు, ఏపిజెన్‌కో వంటి సంస్థలతో పాటు వివిధ సంస్థలకు చెందిన వందలమంది ఈ ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేసారు. విఆర్‌సి నుండి మొదలైన ఈ ర్యాలీ మద్రాసుబస్టాండ్, కెవిఆర్ పెట్రోల్ బంకుల మీదుగా ఏ.సి స్టేడియం వరకు సాగింది. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇ.ఇ. ప్రమోద్‌కుమార్‌రెడ్డి, డిఎఫ్ఓ రామ్మోహన్‌రావులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పర్యావరణానికి చేటు తెస్తే, అది ప్రజాజీవనానికే ప్రమాదకరంగా మారుతుందన్నారు.

# గ్రీన్ కార్పొరేషన్‌కు 30 కోట్లు

## ● 20 కోట్లతో బారాషహీద్ దర్గా అభివృద్ధి

**- మంత్రి నారాయణ వెల్లడి**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

గ్రీన్ కార్పొరేషన్ అమృత్‌పథకం కింద 30 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని రాష్ట్ర మునిసిపల్ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈ నెల 2న మంత్రి నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, బారాషహీద్ దర్గా నుంచి ఇరుకళలమ్మ దేవాలయానికి ఘాట్‌రోడ్డు నిర్మిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల మేరకు రూ. 20 కోట్ల వ్యయంతో దర్గా అభివృద్ధి చేస్తామన్నారు. దర్గా ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పిల్లలు ఆడుకునేందుకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. సర్వేపల్లి కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిందంటూ, ఈ కాలువతో పాటు, జాఫర్‌సాహెబ్ కాలువ నుంచి కిలోమీటర్ దూరం వరకు సుందరీకరణ పనులు చేపడతామన్నారు. నగరంలో మరో నాలుగు బ్రిడ్జిలు ఏర్పాటవుతాయని, ఇందుకోసం నూరు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. మునిసిపల్ శాఖ, 'నుడా' కలసి నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేస్తాయన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తు చేస్తామని, ఏడాది చివరినాటికి ఎల్అండ్‌టి సంస్థ రోడ్లను బాగుచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు, జేసీ వెట్రిసెల్వి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, ఆర్డీఓ హరిత, మునిసిపల్ కమిషనర్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

# విలువలకు ఆయన నిలువుటద్దం

## ● మేకపాటిని పొగిడిన రూరల్ ఎమ్మెల్యే



దివ్యాంగులకు ట్రైసైకిళ్ళను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

విలువలు కలిగిన రాజకీయాలకు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి నిలువెత్తు నిదర్శనమని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభివర్ణించారు. ఈ నెల 5వ తేదీన నెల్లూరు వనంతోపు సెంటర్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ళు అందించే కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తే, తాను ఎంపీ పదవికి రాజీనామా చేసానని, రాజీనామా ఆమోదించినా, ఆమోదించకపోయినా నేను ఎంపీని కానని, అందుకే నైతికంగా ఇలాంటి కార్యక్రమాలకు హాజరు కాలేనని చెప్పారని, తన కారణంగా ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఆపొద్దని, ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని చెప్పారన్నారు.

ఈ కాలంలో ఇటువంటి విలువలు, విశ్వసనీయత కలిగిన నాయకులు కొద్దిమందే కనిపిస్తారన్నారు. ఎంపీ సహకారంతో నెల్లూరు లోక్‌సభ పరిధిలో 68మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ళు అందజేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు లేకపోయినా గత నాలుగేళ్ళలో దాతలు, స్వచ్ఛంధ సంస్థలు, అధికారుల సహకారంతో రూరల్ నియోజకవర్గ పరిధిలో 500మంది దివ్యాంగులను వివిధ రకాలుగా ఆదుకున్నట్లు తెలిపారు.

# అగ్రగామిగా.. ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల

## ● ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌లోనూ, సీట్ల కేటాయింపులోనూ అగ్రస్థానం

## ● కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాల సీట్ల కేటాయింపులో, 2018 సంవత్సరానికి జరిగిన ఇంజనీరింగ్ మొదటి విడత కౌన్సిలింగ్‌లో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలియజేశారు.

ఇటీవల ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, తమ కళాశాలలో ప్రతిభాపాటవాలు కలిగిన అధ్యాపకులు, పిహెచ్‌డి చేసిన అధ్యాపకులు ఉన్నారని, వారి ప్రతిభతో పాటు కళాశాలలో మౌలిక వసతుల ఆధారంగా రాష్ట్రప్రభుత్వం ఈ కళాశాలకు జిల్లాలోని అన్ని కళాశాలలకంటే ఎక్కువ ఫీజును నిర్ణయించినప్పటికీ, అత్యధికంగా 523మంది అడ్మిషన్లు పొందారని తెలిపారు. క్యాటగిరి-బి మేనేజ్‌మెంట్ కోటా కింద కూడా సీట్లన్నీ దాదాపు పూర్తికావస్తున్నాయన్నారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచి ప్లేస్‌మెంట్ కోసం శిక్షణ ఇస్తామన్నారు. చివరి ఏడాదిలో జరిగే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా అర్హతపొందిన వారందరికీ ప్లేస్‌మెంట్స్ ఇస్తారని తెలిపారు. గత సంవత్సరం అనేక ప్రముఖ బహుళజాతి కంపెనీలు ఈ కళాశాలను ఎంపిక చేసుకుని క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలోని ప్రతి విభాగం అనేక పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుని పరిశ్రమల ప్రతినిధుల ద్వారా విద్యార్థులకు పరిశ్రమలలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. గత సంవత్సరం కళాశాలలో అన్ని భవనాలపైనా సోలార్ ఫలకాల ద్వారా విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించామని, కళాశాలలోని ట్రిపుల్-ఇ విద్యార్థులకు సోలార్ రంగంలో ప్రత్యేకంగా తర్ఫీదును ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. జపాన్‌కు సంబంధించిన ప్రైమ్ మేడన్ సంస్థ ద్వారా ఇఇఇ, మరియు ఎం.ఇ విద్యార్థులకు ప్రతిఏటా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మెకానిక్ విభాగంలో 'దస్సాల్ట్ సిస్టమ్స్' కంపెనీకి సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలను కల్పిస్తోందన్నారు.

ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ చదువులతో పాటు ఇలాంటి ప్రత్యేక నైపుణ్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

# నెల్‌క్యాస్ట్ పర్యావరణ దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ మరియు సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీని నెల్‌క్యాస్ట్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ సీనియర్ జీఎం ఆపరేషన్స్ ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం అన్నది నిర్మూలించాలని, తగు జాగ్రత్తలు పాటించాలని, భావితరాల వారికి స్వచ్ఛమైన ప్రకృతి అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ జీఎం టి.మురళీకృష్ణ, నెల్‌క్యాస్ట్ మేనేజర్ పబ్లిక్ రిలేషన్స్ ఆనిమెళ్ళ శివకుమార్, రామ్మోహన్, శశికుమార్, దామోదర్‌రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన

రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులు, సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని నిర్మాణం కోసం చేస్తున్న కృషికి అందరూ కలసి భాగస్వామ్యం అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన చెప్పారు. గూడూరు పట్టణంలోని షాదిమంజిల్‌లో సోమవారం కమిషనర్ ఓబులేసు ఆధ్వర్యంలో నవనిర్మాణదీక్ష సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎటువంటి సౌకర్యాల్లేని ప్రాంతంలో ప్రపంచస్థాయిలో మౌలిక వసతులను కల్పించి నూతన రాజధానిని రూపకల్పన చేయడం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కల్పిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గూడూరు పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో నవనిర్మాణ దీక్షలను అధికారులు నిర్వహించారు.

# ప్రజలకు సేవ చేస్తే గుర్తింపు


జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వై.చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఎ.శివకుమార్

సమాజంలో ప్రజలకు దగ్గరగా ఉండి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తే గుర్తింపు పొందవచ్చునని పలువురు అధికారులు తెలిపారు. గూడూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 3న ఎస్‌బి ఎస్.ఐ కలికి జనార్ధన్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా గూడూరు ఏపి బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్ ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, స్నేహితులు మాట్లాడుతూ జనార్ధన్‌రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేమని, వృత్తినే దైవంగా భావించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# కమిషనర్‌గా ఓబులేసు




గూడూరు పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా ఓబులేసు ఈ నెల 4వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా ఉన్న నరేంద్రకుమార్ బదిలీపై నెల్లూరుకు వెళ్ళగా ప్రస్తుతం గూడూరు పురపాలక సంఘానికి నూతన కమిషనర్‌గా ఓబులేసు వచ్చారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను, పురపాలక ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనలను బాధ్యతలు చేపట్టిన తరువాత మర్యాదపూర్వకంగా కలిసారు. నూతన కమిషనర్‌ను పురపాలక సంఘ కార్యాలయంలోని ఉద్యోగులు, పలువురు కౌన్సిలర్లు కలిసి పరిచయం చేసుకున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# అమరజీవి ఆశయ సాధనకు కృషి


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ నాయకులు

నేటి తరం ప్రజలు పొట్టి శ్రీరాములును ఆదర్శవంతంగా తీసుకొని ఆయన ఆశయాలను సాధించాలని గూడూరు వాసవి క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి సుబ్బారావు పేర్కొన్నారు. గూడూరు పట్టణ ఆసుపత్రిరోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఈ నెల 4న పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాగా నామకరణం చేసి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా తెలుగు రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు వరప్రసాద్, సుధీర్, రాంమోహన్, సురేష్, వంశీధర్, సుధాకర్, రాము, మోహన్‌రావు, సుమన, నరసింహస్వామి పాల్గొన్నారు.



# బాలసదనానికి బ్రాహ్మణ యువజన ఫ్యాన్లు


బాలసదనంకు ఫ్యాన్లు అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

ఎంతో మంది పేద విద్యార్థులకు నీడనిచ్చే దేవాలయం బాలసదనమని ఏపి బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్ తెలిపారు. గూడూరు పట్టణం నరసింగరావుపేటలోని బాలసదనానికి బ్రాహ్మణ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బ్రాహ్మణ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. బ్రాహ్మణుల అభివృద్ధికి సేవా సంఘం అన్ని వేళలా తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. అనంతరం బాలసదనం ప్రతినిధులకు ఫ్యాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, యువజన విభాగం ప్రతినిధులు బాలనందశర్మ, ప్రసాద్, బాలాజీ, రఘురాం, జనార్ధన్, దినకర్, శ్రీధర్, నరేష్, మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.






## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

తగిన నిర్ణయాలు తీసికొని పనులు జరుపుకొంటారు. ఆర్ధికముగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో పురోగతి బాగుంటుంది. ఆదాయ లోపం రాదు. కొత్త కాంట్రాక్టులు, ప్రభుత్వ ఋణాలు అనుమతులు లభిస్తాయి. స్థిరాస్తులపై ఆదాయం, పెట్టుబడులకు కొత్త అవకాశాలుంటాయి. బంధువర్గ సహకారం, ఇంటికి నూతన వస్తువులు సమకూర్చుకొంటారు.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇంటా బయట వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షించుకొనండి. బంధుమిత్రులు సహాయపడతారు. రాజకీయ ప్రాబల్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, కాంట్రాక్టులు, ఏజన్సీలు లభించడం జరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, దూర ప్రయాణాలుంటాయి.

## మిధునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. పెట్టుబడులు స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది. మానసికంగా కుదుటపడతారు. ఇప్పటివరకు ఇబ్బంది పెట్టిన సమస్య సమసిపోతుంది. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల, ఆదాయం బాగుంటుంది. శుభకార్యాలు, ఉద్యోగప్రయత్నాలు నిర్ణయం కావచ్చును. ఉద్యోగ సామర్థ్యం బాగుంటుంది.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలు ఆశించిన విధంగా సాగవు. ఆదాయం తగ్గుతుంది. అనుకున్న పనులు సానుకూలమైనా బాగా టెన్షన్ పెడతాయి. తొందరపాటు, కోపం తగ్గించుకొనాలి. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. ఉద్యోగులకు పని భారం పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. అనుకోని అదనపు ఖర్చులుపైన పడగలవు. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అవసరాలకు ఋణాలు చేబదుళ్ళు తీసికొనవలసి వస్తుంది. వృత్తివ్యాపారాలు సరిగా జరగవు. ఆదాయం తగ్గుతుంది. ముఖ్యపత్రాలు వస్తువులు జాగ్రత్త. చిన్న వ్యాపారవర్గాల వారికి ఇంజనీరు, వైద్యులు, కాంట్రాక్టర్లకు డబ్బు సమకూరుతుంది. గృహ రిపేర్లు, వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు ఆపండి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బయట ఋణ బాధలు పరిష్కరింపబడతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కనబడుతుంది. ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులకు మంచి ఆర్ధికావకాశాలు అందుతాయి. ప్రభుత్వ అనుమతులు, సహకారం బాగుంటుంది. బ్యాంకు ఋణాలు అందుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. బాంధవ్యాలు బలపడతాయి. ఇతరులకు సహాయం చేస్తారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 08.6.2018 నుండి**
**తేది. 14.6.2018 వరకు**

మీన మేష వృషభ రాశులలో చంద్రుడు, వృషభంలో రవి బుధులు, 10తేది నుండి మిధునంలో బుధుడు, మిధునంలో శుక్రుడు, 9తేది నుండి కర్కాటకంలో శుక్రుడు మరియు రాహువు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజకేతువులు సంచరిస్తారు.

**పంచాంగము :**

తేది 13 బుధవారంతో అధికమాసం సమాప్తి
ముహూర్తములు లేవు

### అధిక జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | శుక్ర | నవమి | ఉ॥ గం.8.23వ॥ |
| తేది. 9 | శని | దశమి | ఉ॥ గం.8.26వ॥ |
| తేది. 10 | ఆది | ఏకాదశి | ఉ॥ గం.7.59వ॥ |
| తేది. 11 | సోమ | ద్వాదశి | ఉ॥ గం.7.04వ॥ |
| తేది. 12 | మంగళ | త్రయోదశి | ఉ॥ గం.5.44వ॥ |
| | పిదప | చతుర్దశి | రా॥ గం.4.10వ॥ |
| తేది. 13 | బుధ | అమావాస్య | రా॥ గం.2.04వ॥ |

### నిజ జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | గురు | పాడ్యమి | రా॥ గం.11.47వ॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్ధికాభివృద్ధికి బాగా కష్టపడతారు. పనులు జరగడానికి అనుకూల పరిస్థితులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం కొంత పెరిగినా ఏదో ఒక రూపంలో ఖర్చులుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. చిన్న కారణం దొరికితే విమర్శించే వారుంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యాకోర్సులు లభిస్తాయి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అయినవారితో విభేదాలు రావచ్చు. సర్దుబాటు చేసికొనిపోవాలి. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. కొత్త ఖర్చులు అదనంగా ఉంటాయి. ఏకపక్ష నిర్ణయాలు చేయవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు పెండింగ్‌లో పడతాయి. శుభకార్య నిర్ణయాలు వెనుకబడగలవు. దూరప్రయాణాలుంటాయి.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఎక్కువ ఖర్చులుండినా ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. ప్రభుత్వపరంగా జరగవలసిన పనులు ఆలస్యం కాగలవు. వృత్తి వ్యాపారాలు ఫరవాలేదనిపిస్తాయి. ప్రారంభించిన పనులు ఆలస్యంగా జరుగుతాయి. కాని పర్యవేక్షణ అవసరం. శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. తొందరపాటు మాటలు, చేతలు లేకుండా జాగ్రత్తగా మెలగండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రవర్తన, మాటల తీవ్రత ఎదుటివారికి ఇబ్బంది కలిగించవచ్చును. ఆర్ధిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా సాగవు. ఆదాయం తగ్గుతుంది. అయితే అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. క్రయవిక్రయాలలో జాగ్రత్తగా వ్యవహరించండి. విద్యావృద్ధి అవకాశాలు, శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్ధిక ఇబ్బందులు క్రమంగా తొలగి వృత్తి వ్యాపారాలు వేగవంతం కాగలవు. క్రయవిక్రయాలు వాయిదా వేసికొనాలి. ఆదాయం కొద్దిగా పెరిగినా ఖర్చులు కూడా ఏదో ఒక రూపంలో పెరుగుతాయి. వివాహ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత ఉండదు. దూర ప్రయాణాలుంటాయి. షేర్లు, వ్యాపార పెట్టుబడి అవకాశాలుంటాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

నిర్ణయించుకొన్న పనులన్నీ సక్రమంగా జరుగుతాయి. ఆర్ధిక స్థితి బాగుండి వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా సాగుతాయి. ఆదాయం బాగుంటుంది. పెట్టుబడులకు మంచి అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంది. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంది.

# బాబు ఆశీస్సులుంటేనే ప్రధాని పీఠం

శ్రీను గల్పిక

"బీజేపీని ఓడించాలి... బీజేపీ ముక్త్ భారత్... ఇటలీనే ఇండియా... ఇండియానే ఇటలీ... బీజేపీ డౌన్ డౌన్..." ఢిల్లీ, టెన్‌జనపథ్‌లోని తన గదిలో పడుకున్న కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ గాఢనిద్రలో కలవరిస్తోంది. తెల్లారి ఆరుగంటలు కావడంతో ఎంపీ వి. హెచ్.హనుమంతురావు బెడ్‌కాఫీని ట్రేలో పెట్టుకుని అమ్మగారికివ్వడానికి వచ్చాడు. సోనియాగాంధీ నోటిలో నుండి వస్తున్న ఆ కలవరింతలను శ్రద్ధగా విన్నాడు. వెంటనే బయటకొచ్చి చూసాడు. అప్పుడే రాహుల్‌గాంధీ సైక్లింగ్ ముగించుకుని వచ్చాడు. కాకపోతే ఆయన సైకిల్ తొక్కుకుంటూ రాలేదు.. దానిని నెత్తిన పెట్టుకుని వచ్చాడు. అది చూసి విహెచ్‌కు ఆశ్చర్యమేసింది. రాహుల్‌తో... అదేంటి బాబూ.. సైకిల్ తొక్కుకుని రాకుండా నెత్తిన పెట్టుకుని వచ్చావని అడిగాడు. అందుకు రాహుల్... నేనేమన్నా అమాయకుడినా... మొన్న డాక్టర్ దగ్గరకు వెళ్లాను... బాడీకి వాకింగ్ మంచిదా, సైక్లింగ్ మంచిదా? అని అడిగాను. ఆయన రెండూ ఒకటే అని చెప్పాడు. అప్పటి నుండి సైకిల్‌ను నెత్తినపెట్టుకుని వాకింగ్ చేస్తున్నాను. అటు సైక్లింగ్ చేసినట్లు... ఇటు వాకింగ్ చేసినట్లు... అని చెప్పాడు. ఆ సమాధానానికి విహెచ్‌కు దిమ్మ తిరిగింది. తర్వాత తేరుకుని... బాబూ ఒక్కసారి అమ్మగారి గదిలోకి రండి... ఆమె ఒక విషయాన్ని పదే పదే కలవరిస్తోంది. అదేంటో విందురు రండి అని చెప్పి లోపలకు తీసుకెళ్ళాడు. సోనియాగాంధీ నిద్రలోనే... "బీజేపీని ఓడించాలి... బీజేపీ ముక్త్ భారత్'' అంటూ కలవరిస్తూనే వుంది. చూడు బాబూ అమ్మగారి కోరిక. ఆమె ఆశయాన్ని మీరే ఎలాగైనా నెరవేర్చాలని రాహుల్‌తో వి. హెచ్ అన్నాడు. అప్పుడు రాహుల్... 'అమ్మా' అంటూ అరిచాడు. ఆ గావుకేకకు సోనియా ఉలిక్కిపడి లేచింది. ఏంట్రా సన్యాసి ఎందుకంత కేక పెట్టావ్, నా గుండె గట్టిది కాబట్టి సరిపోయింది అని, ఇంతకీ ఎందుకంతలా అరిచావ్ అని అడిగింది. అమ్మా, నీ ఆశల పుత్రుడినమ్మా నేను... నీ ఆశయాన్ని నెరవేరుస్తాను, ఈ కొడుకును దీవించండి అని ఆమె పాదాలకు నమస్కరించి... ఇక పని పూర్తయ్యాకే తిరిగొస్తా అంటూ వెళ్ళిపోయాడు. సోనియాకు ఏమీ అర్థం కాక... హనుమాన్‌జీ వాడెందుకలా ప్రవర్తిస్తున్నాడు, అసలు ఏమైంది వాడికి అని అడిగింది. దానికి వి. హెచ్... మీరు నిద్రలో "బీజేపీని ఓడించాలి'' అని కలవరించడం రాహుల్ బాబు విన్నాడు తల్లీ, మీ ఆకాంక్షను నెరవేర్చేందుకే ఆయన కంకణం కట్టుకుని వెళ్లాడు అని చెప్పాడు. అప్పుడు సోనియా... అయ్యో ప్రభువా... నా కలవరింతతో వీడిలో ఇంత మార్పు వస్తుందనుకుంటే... అదేదో... రాహుల్ పెళ్ళి చేసుకోవాలి, నేను మనవడితో ఆడుకోవాలి అని యాక్టింగ్ చేసైనా కలవరించే దాన్ని కదా అని వాపోయింది. వి. హెచ్... అంతా ఆ దేవుడే చూసుకుంటాడులే తల్లీ అని నిట్టూర్చి కాఫీ కప్పు తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయాడు.

మూడు నెలల తర్వాత...

టెన్‌జనపథ్‌లో కాంగ్రెస్ నేతలు చిదంబరం గులాంనబీ ఆజాద్, మనీష్‌తివారి, అంబికాసోని, పనబాక లక్ష్మి, మల్లిఖార్జునఖర్గేలు కూర్చుని వున్నారు. సోనియా అప్పుడే అక్కడకు వచ్చింది. వి. హెచ్.హనుమంతురావు అందరికీ బిస్కెట్లు, కాఫీలు అందిస్తున్నాడు. చిదంబరం వుండి... ఏం మేడమ్ అర్జంట్‌గా పిలిపించారని అడిగాడు. రెండు నెలల నుండి రాహుల్ కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగా బీజేపీని ఓడిస్తానంటూ పోయాడు. ఇదేమన్నా కత్తియుద్ధమా ఒకేసారి ఓడించడానికి... ఆ నరేంద్ర మోడీ, అమిత్‌షాలు అసలే ముదుర్లు... ప్రత్యర్థులను పగబట్టి బొక్కలో వేయిస్తున్నారు. రాహుల్‌కు అసలే లోకజ్ఞానం తక్కువ. అసలే అమాయక రకం. ఈ తింగరోడు ఎక్కడ తిరుగుతున్నాడో... ఎక్కడి కెళ్ళాడో ఏమో... దిగులుగా వుంది అని సోనియా చెప్పింది. అప్పుడు గులాం నబీ ఆజాద్ వుండి... రాహుల్ ఓ మహాకార్యం తలపెట్టాడమ్మా... దేశంలో వున్న పార్టీలన్నింటిని బీజేపీకి వ్యతిరేకంగా కలుపుతున్నాడు. కత్తిలాంటి కొడుకును కన్నావమ్మా అని చెప్పాడు. అంతలో రాహుల్ గాంధీ సడెన్‌గా అక్కడకొచ్చేసాడు. అతనిని చూడగానే సోనియాగాంధీ ఆనందంతో కౌగిలించుకుని... ఇప్పుడే నీ గొప్పతనం గురించి చెబుతుంటే వింటున్నాను నాయనా... వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి అన్ని పక్షాలను ఏకం చేసావట కదా... ఇంతకీ ఏమేం చేసావ్ నాయనా అని సోనియా అడిగింది. అప్పుడు రాహుల్ చెప్పసాగాడు. అమ్మా... కర్నాటకలో జెడిఎస్‌తో పొత్తు పెట్టుకుంటాం, వారిచ్చినన్ని సీట్లు తీసుకుని పోటీ చేస్తాం, ఆంధ్రాలో తెలంగాణలో తెలుగుదేశంతోనూ, మహారాష్ట్రలో ఎన్‌సిపి, శివసేనలతోనూ, బీహార్‌లో ఆర్‌జెడి, తమిళనాడులో డిఎంకె, పశ్చిమబెంగాల్‌లో టిఎంసి, వామపక్షాలతో, ఢిల్లీ, పంజాబ్, హర్యానాలలో ఆప్, ఇతర పార్టీలతోనూ, యూపిలో ఎస్పీ, బిఎస్పీలతోనూ మిగిలిన రాష్ట్రాలలో కూడా భావసారూప్య, బీజేపీ వ్యతిరేక పార్టీలతో పొత్తుపెట్టుకోబోతున్నాం. అందర్నీ ఆ దిశగా ఒప్పించానమ్మా అని చెప్పాడు. మంచిది నాయనా... ఇంతకీ ఏ రాష్ట్రంలో ఎవరెవరికి ఎన్నెన్ని లోక్‌సభ సీట్లు ఇస్తామని చెప్పావు నాయనా అని సోనియా అడిగింది. అడుక్కునే అలవాటు నాకు లేదమ్మా... ఎన్నోకొన్ని సీట్లు వాళ్లే ఇస్తామన్నారు. అయినా ఎన్ని సీట్లు అన్నది ఇంపార్టెంట్ కాదమ్మా... బీజేపీని ఓడించాలన్నదే మీ కోరిక... ఆ కోరిక నెరవేర్చడానికే నేను అన్ని పార్టీలను ఏకం చేసాను అని చెప్పాడు. దానికి సోనియా... బీజేపీని ఓడించడమంటే నిన్ను ప్రధానిగా చూడాలన్నది నా ఉద్దేశ్యం... రేపు అన్ని పార్టీలతో పొత్తులతో అరకొర సీట్లు తీసుకుని పోటీ చేస్తే ప్రధానివి ఎలా కాగలవు... కనీసం కాంగ్రెస్‌కు 170సీట్లన్నా వస్తేనే కదా పీఎం కావడానికి అవకాశం వుండేది అని అడిగింది. అందుకు రాహుల్ నవ్వుతూ... నేనేం పిచ్చోడినా అమ్మా... ప్రధాని కావాలంటే 170సీట్లు అక్కర్లేదు... 7సీట్లున్నా చాలు... గతంలో ఇలా ఆరేడు సీట్లు వచ్చిన వాళ్ళను ప్రధానమంత్రిని చేసిన చంద్రబాబును నేను లైన్‌లో పెట్టాను. మనకు పది, పదిహేను సీట్లొస్తే చాలు... ఆయన అండదండలతో ప్రధానినైపోతాను అని చెప్పాడు. రాహుల్ చెప్పింది విని సోనియా కళ్ళు తిరిగి అక్కడే పడిపోయింది.

# నీట్ ఫలితాలలో హిట్‌లు కొట్టిన విశ్వసాయి



జాతీయ స్థాయి నీట్-2018లో నెల్లూరులోని విశ్వసాయి మెడికల్ అకాడమీ మంచి ఫలితాలు సాధించింది. 4వ తేదీ నెల్లూరు వనంతోపు సెంటర్‌లో వున్న విశ్వసాయి కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అకాడమీ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ తాము ఊహించిన విధంగానే తమ కళాశాల నుండి 120మంది విద్యార్థులు ఈ ఏడాది మెడికల్ కాలేజీలలో సీట్లు సాధించే అర్హత సంపాదించారన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకుల ఆధారంగా తమ విద్యార్థులు ఆయా మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందే అవకాశం వుందన్నారు. తమ సంస్థ నుండి ఐ.వి.ప్రత్యేష్ జాతీయ స్థాయి 99.33, బి.వినీత్‌కుమార్‌రెడ్డి 99.02, జి.ప్రవీణ ఆషాజ్యోతి 98.96, యం.విజయకుమార్‌రెడ్డి 98.67, యం.పూజిత 98.65, యస్.కామాక్షి భావగ్న 98.65, యం.లక్ష్మణ్ 98.62 పర్సంటైల్‌ను సాధించారని, నిష్ణాతులైన అధ్యాపక బృందం చేసిన కృషి, నీట్‌కు విద్యార్థులను తయారు చేసిన విధానం వల్లే ఈ ఫలితాలు సాధించామన్నారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ కళాశాలలో అవలంభించే 5స్టెప్ ప్రోగ్రాం, స్ట్రెస్‌ఫ్రీ ఎడ్యుకేషన్, 'నీట్' సిలబస్‌పై తీసుకున్న శ్రద్ధ ఈ ఫలితాలు రావడానికి దోహదపడ్డాయన్నారు.



# మహామనీషి జక్కా వెంకయ్య

**- కుటుంబసభ్యులను పరామర్శించిన సోమిరెడ్డి**

రాష్ట్రంలోని అన్ని అంశాలపైనే కాకుండా ప్రపంచ రాజకీయాలపై సంపూర్ణ అవగాహన గల గొప్ప వ్యక్తి జక్కా వెంకయ్య అని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6న నెల్లూరు బాలాజీనగర్‌లోని జక్కా కుటుంబసభ్యులను, సిపిఎం నేతలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కా వెంకయ్యతో కలిసి పలు ఉద్యమాల్లో పాల్గొన్న రోజులు మరచిపోలేనివని అన్నారు. తన తండ్రి రాజగోపాలరెడ్డి వెంకయ్యతో కలిసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అనేక రాజకీయ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. అమెరికా పర్యటన కారణంగా వెంకయ్య అంత్యక్రియలకు రాలేకపోవడంతో చాలా బాధపడినట్లు వెల్లడించారు. 12వ తేదీ జరిగే సంతాపసభలో తప్పకుండా పాల్గొంటానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణకే...

# వన్నె తెచ్చిన చంద్రమల్‌రెడ్డి

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో 35ఏళ్ళ పాటు సేవలందించి, బ్యాంకు ఖాతాదారులను ఆప్తులు, ఆత్మీయులు, సన్నిహితులుగా మలచుకున్న లింగాల చంద్రమల్‌రెడ్డి ఆ బ్యాంకు చీఫ్‌మేనేజర్ హోదాలో గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేశారు. వై.యస్.ఆర్.జిల్లా పులివెందుల సమీపంలోని యర్రబల్లి కొత్త పల్లి గ్రామానికి చెందిన చంద్రమల్‌రెడ్డి 1983 మే నెలలో పినాకిని గ్రామీణ బ్యాంకులో ఆఫీసర్‌గా చేరారు. ఈ 35 ఏళ్ళలో నెల్లూరు, కడప జిల్లాలలో పలు చోట్ల వివిధ హోదాలలో పనిచేశారు. కడపజిల్లా వాడైనప్పటికీ నెల్లూరుజిల్లాతో ఆత్మీయానుబంధాన్ని పెంచుకున్నారు. ఇక్కడ మిత్రులను పెంచుకున్నారు. స్నేహానికి ప్రాణమిచ్చే చంద్రమల్‌రెడ్డి వ్యక్తిత్వం ఆయనకు స్నేహితులనే కాదు, ఆయన పని చేస్తున్న బ్యాంకుకు ఖాతాదారులను కూడా పెంచింది. 35ఏళ్ళ సర్వీసులో ఆయన ఎంతమంది అభిమానం సంపాదించుకున్నాడన్న దానికి ఉదాహరణ ఆయన పదవీవిరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభలే! మే 31వ తేదీన నెల్లూరు టౌన్‌హాలులో సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్, వాకర్స్ అసోసియేషన్, స్విమ్మర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆయనకు జరిగిన అభినందన సభకు ఆయన మిత్రులు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆయనను పూలదండలతో ముంచెత్తారు. అలాగే ఈ నెల 3వ తేదీన నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆయన ఆత్మీయ అభినందన సభకు పెద్ద సంఖ్యలో ఆయన ఆప్తులు విచ్చేసారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మంత్రి ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి, నిర్మల నరసింహారెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆర్.ఎం ఎస్.వి. రామసుబ్బారావు, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.వి.శివారెడ్డి, ఏ.శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొని చంద్రమాల్‌రెడ్డి చేసిన సేవలను, ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన స్నేహమాధుర్యాన్ని తమ ప్రసంగాలలో వర్ణించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



చంద్రమల్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న మంత్రి ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి

# ఆనం వెంకటరెడ్డికి నివాళి

కీర్తిశేషులు మాజీ మంత్రివర్యులు ఆనం వెంకటరెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 5న హరనాథపురంలోని ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు అభిమానులు తెలుగుదేశం కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆనం వెంకటరెడ్డి ఆశయ సాధనకు కుటుంబ సభ్యులుగా కృషి చేస్తున్నామని నెల్లూరు నగర అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ఎటువంటి రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఆనాడు నెల్లూరు నగర పరిస్థితులకి అనుగుణంగా డ్రైనేజీ సిస్టంను ఆయన తీసుకువచ్చారని తెలిపారు. ఆ సాధనలోనే భాగంగానే సోదరుడు ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు నగరానికి డ్రైనేజీ నిధులు తీసుకు రావడానికి కృషి చేశారని చెప్పారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ తాత ఆనం వెంకటరెడ్డి ఆశయసాధనకు కుటుంబసభ్యులుగా తాము కృషి చేస్తున్నామని, అభివృద్ధిలో అందరినీ కలుపుకు పోతామని, ఆయన చూపించిన ప్రజాసేవ బాట ఏ రోజూ మా కుటుంబం మరువదని తెలిపారు. ఆయన కలలను సాకారం చేస్తామని, అందులో భాగంగానే మెడికల్ కాలేజీని, బ్యారేజిని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి పథకాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. చాట్ల నరసింహారావు ఖాజావలి ఊటుకూరు లక్ష్మయ్య పుట్టా రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి, షమీమ్ పాల్గొన్నారు



ఆనం వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న రంగమయూర్‌రెడ్డి, జయకుమార్‌రెడ్డి



# డిగ్రీ ఫలితాల్లో బిజిఆర్ విద్యార్థినుల ప్రతిభ

ఈ నెల 6వ తేదీ విక్రమ సింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని డా॥ బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభ చూపారు. బిఎస్సీ మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో కె.లక్ష్మి 98 శాతం, వి.లిఖిత 98శాతం, బిఎస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో కె.వాసవి 93శాతం, వి.శ్రావణి 92శాతం, బి.కాం, కంప్యూటర్స్ విభాగంలో టి.హర్షిత 93శాతం, కె.శృతి 91శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ జె.వి.రెడ్డి విద్యార్థులను అభినందించారు. అంకితభావం గల అధ్యాపకులు ఉన్నందువల్లే ఇది సాధ్యపడిందని కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి మృదుల అభిప్రాయపడ్డారు.

# పేదల ఇళ్ళతో వ్యాపారం - ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు నగరంలోని బర్మాషెల్ గుంట ప్రాంతంలో ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్ళను తొలగించవద్దని అలాగే నెల్లూరు నగర నియోజకవర్గంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా॥ పి.అనిల్ కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ అలీంబాషాను కోరారు. 6వ తేదీ కార్పొరేషన్ కార్యాలయంలో వారు కమిషనర్‌తో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ బర్మాషెల్‌గుంట ప్రాంతంలో ఇళ్ళు తొలగిస్తామని నగర కమిషనర్ చెప్పడంతో స్థానికులు ఆందోళన చెందారన్నారు. జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఇళ్ళు మంజూరు చేస్తామని కమిషనర్ తెలిపారని, అందుకు వారు నెలకు రూ.2500 చెల్లించలేరని, ప్రత్యామ్నాయంగా వేరొక ప్రాంతంలో 9అంకణాల స్థలం ఇస్తే అందులో వారు గుడిసెలు వేసుకుంటారని ఖచ్చితంగా చెప్పామన్నారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. అపార్ట్‌మెంట్లు చ.అ. 1100 రూపాయలకు అందరూ నిర్మిస్తుంటే మన మంత్రి నారాయణ చ.అ. 2000రూపాయలు తీసుకొని పేదల ఇళ్ళపై వ్యాపారం చేస్తు న్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, నాయకులు వందవాశి రంగా, కుంచాల శ్రీనివాసులు, ఏ.జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ అలీంబాషాతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

# నెల్లూరులో తీవ్రస్థాయి కాలుష్యం

## పర్యావరణ పరిరక్షణకు చర్యలు అవశ్యం

**- ప్రొ.వైవి రామిరెడ్డి సూచన**

పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణం కాపాడుకోవచ్చని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆదిత్యనగరంలో ఉన్న ఆదిత్యకళాశాల వద్ద ఆయన ఈనెల 5న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి పరిశ్రమ కూడా విస్తీర్ణంలో 33శాతాన్ని గ్రీన్‌బెల్ట్‌గా ఏర్పాటు చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యర్థాలను నివాస ప్రాంతాల్లో విడుదల చేయకూడదని, పరిశ్రమ ఏర్పాటులో ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యత ఇస్తూ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఆమోదాన్ని నమోదుచేయాలన్నారు. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించే పరిశ్రమలకు మూసివేత నోటీసులు జారీ చేసి భారీ జరిమానాలను విధించి, ఆ నిధులను పరిసరప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు వినియోగించాలన్నారు. నెల్లూరుజిల్లాలో



మొక్కను నాటుతున్న ప్రొ. వై.వి.రామిరెడ్డి, ఆచార్య ఆదిత్య తదితరులు

కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో నెలకొల్పిన పవర్‌ప్లాంట్‌లు మరియు ఇతర పరిశ్రమల నుంచి వెలువడే వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సెంట్రల్ పొల్యూషన్ బోర్డు సర్వే మేరకు నెల్లూరు నగరంలో కాలుష్యం హైదరాబాదుతో సమానంగా తీవ్రస్థాయిలో ఉందని, ఈ కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కేవలం ప్రభుత్వాలే కాకుండా పర్యావరణ పరిరక్షణను అందరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి కాలుష్య నివారణకు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాలల డైరెక్టర్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ పుల్లయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య పింఛన్ల పంపిణీ



నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న నెల్లూరు చిన్నబజార్‌లోని సంస్థ కార్యాలయంలో వృద్ధాప్య పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొని 60మంది వృద్ధులకు రూ.500 వంతున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చేతులమీదుగా ప్రారంభమైన పింఛన్ కార్యక్రమం 60మంది వరకు ఇచ్చే స్థాయికి ఎదిగినందుకు అసోసియేషన్ సభ్యులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అమరా మోహన్‌రావు, ప్రధానకార్యదర్శి ఎంపి ఆంజనేయులు, కోశాధికారి కె.శోభన్‌బాబు, ప్రోగ్రాం ఛైర్మెన్ ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డి.గోపీకృష్ణ, ముల్లంగి రాధాకృష్ణయ్య, జమిలి శ్రీనివాసులు, జె.రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

### పేద ఆర్యవైశ్య విద్యార్థులకు

## ఉచిత హాస్టల్ వసతికి దరఖాస్తులు

శ్రీ పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో 2018 –19 సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకొనే విద్యార్థులకు ఉచిత భోజన, హాస్టల్ వసతి కొరకు దరఖాస్తులు చేసుకోవాలని శ్రీ పాండు రంగ అన్నదాన సమాజం కార్యదర్శి నీలిశెట్టి వెంకటేశ్వరప్రసాద్, హాస్టల్ కమిటి ఛైర్మెన్ తవ్వా శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు ఫారాలు జారీ చేస్తామన్నారు. 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, తుది జాబితాను ఈ నెల 22వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు నెల్లూరు పప్పులవీధిలోని అన్నదాన సమాజంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంత్రం 5గంటల నుండి రాత్రి 8గంటల వరకు సంప్రదించాలన్నారు.

## మాట వెలుగు

**- చిన్ని నారాయణరావు**
**9440202942**

మాట నిలకడతోనే
కొత్త హవిస్సు పరచుకొని
మనిషి వ్యక్తిత్వం
చైత్రసమాగమమవుతుంది
పూవుకు తావి అబ్బినట్లు
మనిషితనం శోభిత వసంతమై
గుబాళిస్తుంది
మానవీయత మకుటాయమానంగా
ఎగసిన కాంతిపుంజమై
విలువైన సమాజపు సుప్రభాతాల్ని
ప్రభవిస్తుంది.
మాట మీద నిలబడడంతోనే
మనిషి గగనమంతు ఎత్తు ఎదిగి
శిఖరాగ్రసమమై అగ్రాసనాన నిలుస్తాడు
ఎందరికో ఆదర్శమై మహోజ్వల
మానవీయ మూర్తిగా ఎదిగి
దేదీప్యమానంగా భాసిస్తాడు
ఎన్ని కష్టాలెదురైనా –
ఎన్ని సంవేదనలైనా –
మాటల మాగాణిగా బ్రతకడమే కాదు
అకుంఠిత దీక్షాదక్షతల ప్రస్ఫుటానికి
నాందీ వాచకమవుతుంది
నాయకత్వానికి అదో రాజమార్గమై
మనసుల్ని జయిస్తుంది
నమ్మకాల పంటలతో ఎల్లెడలా
ప్రజాజీవనం సుభిక్షమవుతుంది.
జన సమ్మోహనమై
జాగృతి వెంట నడిచే ఉత్తమోత్తమ
సంస్కృతి వెల్లువెత్తుతుంది.
మాటకు విలువనివ్వడమంటే
జ్యోతి వెల్గించి కిరణాల
పందిరి వెయ్యడమే!
రేపటి సూర్యోదయానికి
ఎదురేగి స్వాగతం పలకడమే కాదు
ఆ వెలుగులో జీవితాల్ని
మహోన్నతంగా తీర్చిదిద్దుకోవడమే
మాట మన్నించబడే చోట
చీకటి పాతరేయబడుతుంది
కోర్టులు చట్టాలు నిరుపయోగమై
నిర్వీర్యమవుతాయి
సరికొత్త లోకం కనులముందు
సాక్షాత్కారమవుతుంది
ఓ సుందరస్వప్నం ఆవిష్కరింపబడి
జీవనమార్గం స్వర్గతుల్యమవుతుంది!

## పంచతంత్రం

(మొదటి పేజీ తరువాయి)

ఫార్మాట్‌లోనే చేసారు. ఈ 5మంది మళ్ళీ ఉపఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఒకటికి రెండుసార్లు ఎంపీలను వివరణ అడిగారు. మొన్న ధృవీకరణ పత్రాలు కూడా తీసుకున్నారు. ఈ ఐదుగురి రాజీనామాలను ఇక ఆమోదించినట్లే! దీంతో ఆరు నెలలలోపే ఆ ఐదు స్థానాలకు తిరిగి ఉపఎన్నికలు నిర్వహించాల్సివుంటుంది.

అయితే లోక్‌సభ గడువు ఏడాది కాలమే వుంది. సార్వత్రిక ఎన్నికలకు సంవత్సరం కూడా గడువు లేని తరుణంలో వ్యయప్రయాసలు తప్ప, ఇంకోటి లేని ఈ ఉపఎన్నికలు అవసరమా అనే చర్చ కూడా నడుస్తోంది. వాస్తవ దృష్టితో చూస్తే ఏడాదిలోపు సార్వత్రిక ఎన్నికలు వుండగా ఇంతలోపే మళ్ళీ ఎన్నికలు అనవసరం. ఇప్పుడు ఈ ఐదు స్థానాలకు ఎన్నికలు నిర్వహించినా తిరిగి సార్వత్రిక ఎన్నికలలోనూ మళ్ళీ ఎన్నికలు తప్పవు. కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృధా కావడంతో పాటు, రాజకీయ పార్టీలకు కూడా అనవసరమైన ఖర్చు.

ఒకవేళ లోక్‌సభ స్పీకర్ రాజీనామాలు ఆమోదించి ఎన్నికలు వచ్చాయే అనుకుందాం. వైసిపి ఎంపీలు తమ స్థానాల నుండే పోటీ చేస్తారు. టీడీపీ కూడా ఉపఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టే అవకాశముంది. అయితే ఇక్కడ లాజిక్ ఏంటంటే వైకాపా ఎంపీలు 5మంది కూడా తెలుగుదేశం ప్రభుత్వానికి సవాల్ విసురుతూ రాజీనామా చేయలేదు. ప్రత్యేకహోదా ఇవ్వనందుకు కేంద్ర వైఖరికి నిరసనగానే రాజీనామా చేసారు. రేపు ఉప ఎన్నికలలో ప్రత్యేకహోదా నినాదంతోనే వాళ్ళు పోటీ చేస్తారు. మరి తెలుగుదేశం తమ అభ్యర్థులను పోటీలోకి దించి వైసిపి ఎంపీలను ఓడించాలని చూసినా, ఓడించినా అది వారిని ఓడించినట్లు కాదు. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఓడించినట్లు. ఈ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకహోదా అవసరం లేదని కేంద్రానికి తెలియపరిచినట్లు. మరి ఇప్పటికే ప్రత్యేకహోదా ఉద్యమాన్ని నీరుగార్చిన తెలుగుదేశం మరోసారి అటువంటి పనికి పాల్పడుతుందా?

ఉపఎన్నికలు రాకుంటే తెలుగుదేశంతో పాటు వైసిపికి కూడా మేలే! ఉపఎన్నికల వల్ల ఇరుపార్టీలకు ఒరిగేదేమీ లేదు. ఇద్దరికీ దండగ ఖర్చే! కేంద్రం కూడా ఇదే ఆలోచిస్తుండొచ్చు. ఒకవేళ లోక్‌సభ స్పీకర్ ఇప్పుడే రాజీనామాలు ఆమోదించినా కూడా ఉపఎన్నికలకు అవకాశం తక్కువ. ఎన్డీఏ ప్రభుత్వం నవంబర్, డిసెంబర్‌లలోనే సార్వత్రిక ఎన్నికలకు వెళ్ళే అవకాశాలున్నాయి. త్వరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎన్నికలున్నాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటే ఆ రాష్ట్రాల ఎన్నికలను కలిపి పెట్టేలా కేంద్రం వ్యూహరచన చేస్తోంది. ముందస్తు ఎన్నికలు ఆలోచన వున్నా వైసిపి ఎంపీల రాజీనామాలను స్పీకర్ ఆమోదించవచ్చు. ఉపఎన్నికలు రాకపోయినా ప్రత్యేకహోదా కోసం పదవులు వదులుకున్న త్యాగమూర్తులుగా వాళ్ళకు గుర్తింపు లభిస్తుంది.

ఎంపీల రాజీనామాలు రాజకీయంగా వైకాపాకు ఎంతోకొంత ప్రయోజనం చేకూర్చేవే! ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఇప్పటికే సొంతం చేసుకున్న వైసిపి ఎంపీల రాజీనామాలు ఆమోదం పొందితే ఉపఎన్నికలు వచ్చినా, రాకున్నా ఈ ఉద్యమంలో మరో మైలురాయిని దాటినట్లే!

## కులకాష్టంలో రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

కాని, రాష్ట్రానికి ఏం దరిద్రం ముసించిందోగాని గత నాలుగేళ్ళుగా కులం జాడ్యం పెరుగుతూ వస్తోంది. కులాల మధ్య చిచ్చు రేగింది. దీనికి బీజం వేసింది చంద్రబాబునాయుడే! 2014 ఎన్నికల్లో ఓట్ల కోసం కాపులకు రిజర్వేషన్‌లు అంటూ రెచ్చగొట్టాడు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక మంజునాథ్ కమిషన్ వేసి బి.సిలను రెచ్చగొట్టాడు. పలుచోట్ల కాపులు, బీసీల మధ్య రిజర్వేషన్‌ల విషయమై గొడవలు జరిగాయి. రాష్ట్రంలో తెలుగుదేశంకు బలమైన మద్దతుదారులుగా వున్న బ్రాహ్మణులను కూడా ఈ కులం కంపులోకి లాగారు. టీటీడీ రిటైర్డ్ ప్రధానార్చకులు రమణదీక్షితులు, తెలుగుదేశంపార్టీకి మధ్య జరుగుతున్న గొడవను చూస్తూనేవున్నాం. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గతంలో ఛైర్మెన్‌గా వ్యవహరించిన ఐవిఆర్ కృష్ణారావు ప్రభుత్వ నిర్వాకంపై విమర్శలు ఎక్కుపెట్టాడు. పరిపాలనలోనూ కుల వివక్ష పెరిగిపోయింది. ఈ ప్రభుత్వంలో రెండు మూడు కులాల వారికే పనులవుతున్నాయి. ప్రభుత్వ శాఖల బదిలీలలో వారికే ప్రాధాన్యత లభిస్తోంది. కొన్ని కులాల వారిని శత్రువులుగా చూస్తున్న విష వాతావరణం నెలకొంది. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు కులాల పేర్లతో తీవ్రంగా దూషించుకుంటున్నారు. కుల సంఘం నాయకుల మధ్య చర్చా వేదికలు పెట్టి పచ్చమీడియా వివాదాలను పెంచిపోషిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు, ఆయన ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ నామినేటెడ్ పదవుల్లో వున్న నాయకులే ఆయా కులాలను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు.

రాష్ట్రంలో ఇంతటి కుల పైత్యం ఎప్పుడూ లేదు. ఓట్ల కోసమే కుల రాజకీయాలకు పాల్పడితే అది తమంతట తాము గోతిని తవ్వుకోవడమే అవుతుంది. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క కులం బలం మీదనో, కులం పునాదుల మీదనో ఏ పార్టీ నిర్మాణం జరగలేదు, ఏ ప్రభుత్వం ఏర్పడలేదు. తెలుగుదేశం అధినేత దీనిని తెలుసుకుని తన పాలనను మలచుకుంటే మంచిది.

# ఆత్మకూరు టీడీపీకి... దిక్కెవరు?

## ఆనంను నిలబెట్టుకోవాలనుకున్న ప్రయత్నాలన్నీ విఫలం



ఈ నెల 8వ తేదీన నాయుడుపేటలో నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవనిర్మాణదీక్ష సభకు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి రానని చెప్పడంతోనే తెలుగుదేశం శ్రేణులకు ఆయన ఉద్దేశ్యం అర్ధమైపోయింది. ఆనం రామనారాయణరెడ్డిని తెలుగుదేశంలో నిలుపుకునేందుకు జిల్లా మంత్రి పి.నారాయణ నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మంత్రి నారాయణ స్వయంగా ఫోన్ చేసి ఆత్మకూరులో నవనిర్మాణ దీక్షలు చేపట్టాలని కోరినా రామనారాయణ రెడ్డి వినలేదు. నేనుండడం లేదు, మీ పాటికి మీరు చేసుకోండని చెప్పినట్లు తెలుస్తోంది. 8వ తేదీ చంద్రబాబు పర్యటనకు హాజరు కావాలని కోరినా తాను ఆరోజు నెల్లూరులో ఉండడం లేదని తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన టీడీపీని వీడనున్నాడనే విషయం అర్ధమైపోయింది. ఆయనను పార్టీలో నిలబెట్టాలని నాయకులు చేసిన ప్రయత్నాలన్నీ కూడా విఫలమయ్యాయి. అయితే ఆత్మకూరులో జరిగిన రాజకీయ పరిణామాలను చూసి స్థానికంగా వున్న ఓ వర్గం వాళ్ళు మాత్రం తెలుగు దేశం పార్టీ వాళ్ళకు ఇలా జరగాల్సిందేలే అని చంకలు గుద్దుకుంటున్నారు.

ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరిన తర్వాత అప్పటి వరకు ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన గూటూరు కన్నబాబును పక్కనపెట్టారు. ఇన్‌ఛార్జ్‌గా కన్నబాబు అప్పుడప్పుడే ఆత్మకూరులో వర్గాన్ని పెంచుకుంటున్నాడు. 2014 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్ని వదిలిపెట్టలేదు. ఇన్‌ఛార్జ్‌గా వుంటూనే పార్టీ అధికారంలో వుంది కాబట్టి అన్ని శాఖలపై అజమాయిషీ చేసాడు. అనుచరులకు పనులు చేసిపెట్టాడు. కొంతవరకు వర్గాన్ని కూడగట్టాడు. సడెన్‌గా ఆనం రామనారాయణరెడ్డి పార్టీలో చేరడం, ఇన్‌ఛార్జ్‌గా ఆయనను నియమించడంతో కన్నబాబు పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

ఇప్పుడు ఆత్మకూరులో తెలుగుదేశం బాధ్యతలు ఎవరు తీసుకోవాలనే ప్రశ్న వస్తోంది. కన్నబాబుకు బాధ్యతలు ఇచ్చినా మళ్ళీ మొదటి నుండి పరుగు మొదలుపెట్టాలి. మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడును రంగంలోకి దించినా పెద్దగా ఫలితం కనిపించకపోవచ్చు. ఆయన ఆత్మకూరుకు దూరమై పదేళ్ళు కావస్తోంది. ఇక్కడ మునుపటి హవా వుండకపోవచ్చు. మొత్తానికి ఆనం వెళితే ఆత్మకూరు టీడీపీలో రాజకీయ శూన్యత ఖాయం.

# పేదలకు ప్రేమతో కూడిన విద్య



## విద్యార్థులకు స్కూల్ కిట్‌లను పంపిణీ చేసిన శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పేదలంటే ఎంతో ప్రేమని, పేదవిద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతోనే విపిఆర్ విద్య స్కూల్‌ను ప్రారంభించారని విపిఆర్ విద్య స్కూల్ కరస్పాండెంట్ శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి పేర్కొన్నారు. ఈ నెల 6న నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య స్కూల్‌లో 6, 7, 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వేమిరెడ్డి ఆశయాలకనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అందుకోవాలని ఆకాంక్షించారు. మీరు మంచి వృద్ధిలోకి రావడమే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మీకు అందిస్తున్న విద్యాసౌకర్యానికి బహుమానమని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థి, విద్యార్థినులకు ఉచితంగా బుక్స్, స్కూల్ బ్యాగ్, షూస్, యూనిఫామ్, జామెట్రీ బాక్స్, వాటర్ బాటిల్ కలిగి వున్న కిట్‌లను ప్రశాంతి రెడ్డి అందజేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తేవాలని కోరారు.

విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమ మార్గంలో తీర్చిదిద్దాలని కోరారు.

ఈ సమావేశంలో విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిఎం పబ్లిక్ రిలేషన్స్ రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.







# కేంద్ర పశుసంవర్ధకశాఖ కమిటీలో వై.వి.రామిరెడ్డి



తిరుపతిలోని ఎస్వీ యూనివర్శిటీలో రసాయన శాస్త్రం అధ్యాపకులుగా పనిచేస్తున్న యల్లాల వెంకటరామిరెడ్డి(వై.వి.రెడ్డి)ని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని పశుసంవర్ధక శాఖ కమిటి (కమిటి ఫర్ ది పర్పస్ ఆఫ్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్‌పరిమెంట్స్ ఆన్ యానిమల్స్)లో సభ్యునిగా నియమించారు. ఈమేరకు కేంద్రప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ గౌరీశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరుజిల్లా వింజమూరుకు చెందిన వై.వి.రామిరెడ్డి విద్యార్థి దశ నుండి ఏబివిపి నాయకుడిగా రాణించారు. ఎస్వీ యూనివర్శిటీలోనూ ఏబివిపి నాయకుడిగా పనిచేశారు. ఆరెస్సెస్ భావాలు కలిగిన వ్యక్తి. తాను చదివిన యూనివర్శిటీలోనే ఆచార్యునిగా సేవలందిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులుగా కూడా ఆయన పనిచేశారు. ప్రస్తుతం ఆయన సభ్యుడిగా వేసిన కమిటీ ఆధ్వర్యంలోనే విద్యాలయాలు, ఎరువుల కర్మాగారాలు, పశువులు, జంతువులపై పరిశోధనలు జరగాలి. ఈ కమిటీయే వాటిని పర్యవేక్షిస్తుంది.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేసే కమిటీలో స్థానం పొందిన వై.వి.రామిరెడ్డికి 'లాయర్' అభినందనలు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com